ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

మంగళవారం 20 మే 2025

ఉష్ణోగ్రత (అంచనా)

20-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	36	27
తెనాలి	36	28
నరసరావుపేట	35	25
బాపట్ల	35	28
రెంటచింతల	38	26
చీరాల	34	26



1,2.. అంటే పెద్ద పరీక్షే!

- ఇదీ గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భూసార పరీక్షల తీరు..
- ఒక్క ల్యాబ్ ఉన్నా..పల్నాడు జిల్లానే కొద్దిగా మెరుగు
- వేలల్లో మట్టి నమూనాల సేకరణ లక్ష్యం..
- క్షేత్రస్థాయిలో జరుగుతున్నది ఒకటి .. రెండే
- ల్యాబ్‌లలో సిబ్బంది, రసాయనాల కొరత..
- ప్రభుత్వ సూక్ష్మ పోషకాలు కోల్పోవాల్సిందేనా..?



మట్టి నమూనాల పరీక్షలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

భూసార పరీక్షలు యజ్ఞంలా చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా ఆచరణలో వ్యవసాయ శాఖ చతికిల పడింది. మట్టి నమూనాలను టార్గెట్‌ల మేర సేకరిస్తున్నారే తప్పా.ఆ మేరకు పరీక్షలు జరగడం లేదు. రైతులకు పుడమి ఆరోగ్య కార్డులు పంపిణీ చేయాలని ప్రభుత్వం సంకల్పించినా ఆచరణలో సాధ్యమయ్యే పరిస్థితులు లేవు. వర్షాలు ఈ సారి ముందుగానే కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో అన్నదాతలు సాగుకు సమాయత్తమవుతున్నారు. అయితే పంట సాగు నాటికి భూసార పరీక్షలు పూర్తి కావు. పంటల సాగులో భూసార పరీక్షలు కీలకం.

భూసార పరీక్షలతో లాభాలు..

భూమిలో సారం ఎంత ఉందో పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. సాగు నేలలో సూక్ష్మపోషకాలు ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. పరీక్షల ఆధారంగా భూమి సారాన్ని నిర్ధారించి ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో అన్నదాతలకు తెలియజేస్తారు. భూసారం బాగుంటేనే పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. నేలలో ప్రధాన పోషకాలైన ఉదజని సూచికతో పాటు, మట్టి పరీక్షల ద్వారా ఆమ్ల, క్షార లవణాలస్థాయి(పీహెచ్)తో పాటు పాస్పరస్, పోటాషియం, ఆర్గానిక్ కార్బన్, సల్ఫర్, జింక్, ఐరన్, కాపర్, బొరాన్, మెగ్నీషియం నేలలో ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. పొలంలో పంటలు బాగా పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో సరైన పోషకాలు ఉన్నాయా.. లోపాలు ఉన్నాయా అనేది పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఈ మేరకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు సూచిస్తారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన భూసార పరీక్షలు అటకెక్కాయి.

మట్టి నమూనాల పరీక్షలు వేగవంతం చేసి వచ్చే జూన్ కన్నా హెల్త్ కార్డులు అందజేయాలని రైతులు కోరుతున్నారు.



ల్యాబ్‌లో మట్టి పరీక్షలు పరికరాలు

గుంటూరు జిల్లాలో ఒకటే..

గుంటూరు జిల్లాలో మట్టి నమూ నాల పరీక్షల కోసం మూడు ల్యాబ్‌లు ఉన్నా యి. 13,882 మట్టి నమునాలను పరీక్షించాలనేది లక్ష్యం కాగా ఇప్పటికి 10,269 నమూనాలను సేకరిం చారు. టార్గెట్‌లో 74.07 శాతం మాత్రమే సేకరణ పూర్త యింది. సేకరించిన నమూనాల్లో ఒకటే నమూనాను పరీక్షించి సాయిల్ హెల్త్ కార్డు సిద్ధం చేశారు. ఈ జిల్లాలో నమూనాల పరీక్షల్లో అంతులేని నిర్లక్ష్యం నెలకొంది. మట్టి నమూనాల పరీక్షలు ఇలా కొనసాగితే ఏడాదికి పూర్తయినా.. పూర్తయి నట్లేనని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సూక్ష్మపోషకాలు కోల్పోయే పరిస్థితి..

జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, భాస్వరం, నత్రజని, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు.. వచ్చే సీజన్‌లో పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూసార పరీక్షల ద్వారా సూక్ష్మ పోషకాల లోపాలను నిర్ధారించనున్నారు. ఈ మేరకు సూక్ష్మ పోషకాలను రాయి తీపై అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మట్టి నమూనాల పరీక్షలు ఇలానే సాగితే ప్రభుత్వం అందజేయనున్న సూక్ష్మ పోషకాలను రైతులు కోల్పోయే ప్రమాదం ఉంది.

1, 2.. ఇవి పోటీ పరీక్షల్లో విద్యార్థుల ర్యాంకుల కాదు.. వ్యవసాయాధారిత జిల్లాల్లో వ్యవసాయ శాఖ నిర్వహించిన మట్టి నమూనా పరీక్షలు.. మట్టి నమూనాల పరీక్షలు లక్ష్యం ఘనంగా ఉన్నా.. ఆచరణ శూన్యంగా ఉంది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 60,124 మట్టి నమూనాల పరీక్షల లక్ష్యం కాగా.. ఇప్పటికి 452 నమూ నాల పరీక్షలు మాత్రమే పూర్తయినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. జిల్లాల వారీగా ఆచరణ సాధ్యం కాని స్థాయిలో మట్టి పరీక్షల టార్గెట్‌లు ఇచ్చిన ప్రభుత్వం.. క్షేత్రస్థాయిలో వసతులు కల్పించ డాన్ని విస్మరించింది. పరీక్షల ల్యాబ్‌లలో రసాయనాలు, పరికరాలు, సిబ్బంది కొరత వెంటాడుతోంది.

పల్నాడులో రోజుకు 100 నమూనాల పరీక్ష..

పల్నాడు జిల్లాలో రోజుకు వంద నుంచి 150 లోపే మట్టి నమూనాల పరీక్షలు జరుగుతున్నాయి. 28 మండలాలకు ఉన్నది ఒక్క ల్యాబే. దీనిలో కూడా సిబ్బంది కొరత నెలకొంది. చిలకలూరిపేటలోని ల్యాబ్‌ను సిబ్బంది, పరికరాల కొరతతో మూసివేశారు. దీంతో జిల్లాలో సేకరించిన మట్టి నమూనాలను నరసరావుపేట ల్యాబ్ లో మాత్రమే చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ల్యాబ్‌లో వసతులు లేక మహిళా సిబ్బంది తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అయితే జిల్లాలో 23,437 మట్టి నమూనాల పరీక్షల చేయాలని లక్ష్యంగా నిర్ద యించారు. 18,953 మట్టి నమూనాలను సేకరించారు. 80.87 శాతం మట్టి నమూనాల సేకరణ పూర్తి చేశారు. ఇందులో 452 మట్టి నమూనాలను పరీక్షించి సాయిల్ హెల్త్ కార్డులను సిద్ధం చేశారు. నిర్దేశించిన లక్ష్యంలో 2.38 శాతం మాత్రమే మట్టి నమూనాల పరీక్షలు పూర్తయ్యాయి. రోజుకు వంద చొప్పున నమూనాల పరీక్షలు చేస్తే ఖరీఫ్ సీజన్ ముగిసే లోపు కూడా భూసార పరీక్షల కార్డులు రైతులకు అందే పరిస్థితి ఉండదు. పల్నాడు జిల్లాలో సేకరించిన మట్టి నమూనాల్లో 50 శాతం గుంటూరు.. బాపట్ల పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు అనుమతి కోరుతూ లేఖ రాసినట్లు జేడీ మురళీ తెలిపారు. గుంటూరు, బాపట్ల జిల్లాతో పోలిస్తే పల్నాడు జిల్లాలో పరీక్షలు కొంత మెరుగ్గా ఉంది.



నరసరావుపేటలోని భూసార పరీక్షల ల్యాబ్

బాపట్ల జిల్లాలో రెండు..

బాపట్ల జిల్లాలో మట్టి నమూనాల పరీక్షలకు మూడు ల్యాబ్‌లు ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అయితే ల్యాబ్‌లు ఉన్నా నమూనాల పరీక్షల్లో తీవ్ర నిర్లక్ష్యం తాండవిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ జిల్లాలో 22,825 మట్టి నమూనాల పరీక్షల లక్ష్యం కాగా ఇప్పటికి 14,798 మట్టి నమూనాలను సేకరించారు. 64.83 శాతం మట్టి నమూనాలను సేకరించగా వీటిలో రెండు నమూనాల పరీక్షలు పూర్తి చేసి సాయిల్ హెల్త్ కార్డులు సిద్ధం చేశారు. సిబ్బంది, రసాయనాల కొరత వల్లే మట్టి పరీక్షలు జరగడం లేదన్న వాదనను సదరు అధికారులు వినిపిస్తున్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

మహానాడుతో పార్టీకి పునరుత్తేజం

ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, కొల్లూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): మహానాడు కార్యక్రమంతో టీడీపీకి పునరుత్తేజం వస్తుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం వేమూరులో నిర్వహించిన మినీ మహానాడు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభలో మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీని స్వర్గీయ నందమూరి తారక రామారావు 43 ఏళ్ల క్రితం స్థాపించారని, మే 28వ తేదీ ఆయన జయంతిని పురస్కరించుకుని ఏటా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు పండుగ వాతావరణంలో మహానాడు కార్యక్రమం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ మహానాడు మాత్రం ఎంతో ప్రత్యేకమన్నారు. ఒక్క చాన్స్ అంటూ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన జగన్‌ను ప్రజాక్షేత్రంలో ఆ వ్యక్తి పనికి రాడని ప్రజలే గత సార్వత్రిక ఎన్నికల్లో తీర్పునిచ్చి గద్దెదించారని గుర్తుచేశారు. మళ్లీ ముఖ్యమంత్రి చంద్రబాబు తిరోగమనంలో ఉన్న రాష్ట్రాన్ని పురోగతి సాధించేందుకు అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. పార్టీ విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు ప్రభుత్వపరంగా, పార్టీ పరంగా పదవులు దక్కుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, పార్టీ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, బాపట్ల పార్లమెంట స్థాయి అధికార ప్రతినిధి విజయబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా, మైనేని మురళీకృష్ణ పాల్గొన్నారు.

పాడి రైతుకు బీమా రక్ష

సేద్యం నష్టాలను మిగిల్చిన ప్రతిసారీ ఎంతోకొంత పాడి పరిశ్రమే అన్నదాతలను ఆదుకుంటూ వస్తోంది. అంతటి కీలకమైన రంగాన్ని గత ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసి.. పాడి రైతుల ప్రయోజనాలకు గండి కొట్టింది. పశువులకు బీమా విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. అటు రైతులూ సొంతంగా బీమా చేసుకోకుండా చేసి.. వారిని నిలువునా వంచించింది. అరకొరగా చేసిన బీమాకు సొమ్ము అందించడానికి ఏళ్ల తరబడి రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పింది.. ఈ బాలారిష్టాలను తొలగించి పాడి పరిశ్రమను తిరిగి గాడిలో పెట్టడానికి కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది.



- రైతులు కట్టే ప్రీమియం వాటా తగ్గింపు
- తొలి విడతలో మూడు జిల్లాలకు రూ.88 లక్షలు విడుదల
- దశల వారీగా నిధుల విడుదలకు కసరత్తు
- రైతులకు పశుసంవర్ధక శాఖ అవగాహన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పశు బీమాపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వంలో బీమా ప్రీమియం వాటా రైతులు చెల్లించాల్సింది 20 శాతం ఉండేది. ఇప్పుడు దానిని 15 శాతానికి తగ్గించి, రైతులకు మరింత మేలు చేసేలా మార్గదర్శకాలు జారీ చేయడంతో పాటు.. తొలి విడతలో భాగంగా మూడు జిల్లాలకు ప్రీమియం వాటా తాలూకా నిధులను ప్రభుత్వం విడుదల చేయడంతో పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతు వాటా 5 శాతం తగ్గింపు..

పశువులకు చెల్లించే బీమా ప్రీమియం సొమ్ములో గతంలో రైతు వాటా 20 శాతంగా ఉండేది. ఇప్పుడు దానిని 15 శాతానికి తగ్గించగా.. మిగిలిన 85 శాతంలో కేంద్రం 60, రాష్ట్రం 40 శాతం భరించే విధంగా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ప్రీమియం వాటాకు సంబంధించి తొలి విడత నిధుల విడుదలను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది. దీనిలో భాగంగా బాపట్ల జిల్లాకు రూ.32 లక్షలు విడుదల కాగా.. 63 శాతం పశుసంవర్ధకశాఖ ఖర్చు చేసింది. పల్నాడు జిల్లాలో రూ.30 లక్షలు, గుంటూరు జిల్లాలో రూ.26 లక్షలు తొలి విడతలో భాగంగా బీమా ప్రీమియం నిధులు విడుదల కాగా.. 70 శాతం ఈ రెండు జిల్లాల పరిధిలో ఇప్పటికే ఖర్చు చేశారు. పశువుకు బీమా రూ.30 వేలుగా ఉంటే.. ప్రీమియం సొమ్ము రూ.1,920గా ఉంది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా రూ.1,632 ఉంటే.. రైతు వాటాను రూ.283కే ప్రభుత్వం పరిమితం చేసింది. పశువులకు బీమా రూ.50 వేలు వరకు, గొర్రెలు, మేకలకు రూ.6 వేలు వరకు కల్పించేలా ఆదేశాలు జారీ చేసింది. గతంలో బీమా సౌకర్యం ఐదు పశువులకు మాత్రమే గరిష్ఠంగా ప్రభుత్వం కల్పించేది. దానిని ఇప్పుడు పది వరకు పెంచింది. గొర్రెలు, మేకలకు (మిగతా 6వ పేజీలో)



మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

కార్యకర్తల సంక్షేమం కోసం కృషి

ఎమ్మెల్యే వేగేశన ● ఘనంగా బాపట్లలో మినీ మహానాడు

బాపట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ పదవుల కేటాయింపులో సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నియోజకవర్గ మహానాడు నిర్వహించారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీరామారావు విగ్రహానికి పుష్పాంజలిఘటించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇటీవల మరణించిన పార్టీ నాయకులకు సంతాపం ప్రకటిస్తూ మౌనం పాటించారు. అనంతరం మినీ మహానాడుకు అధ్యక్షత వహించి ఎమ్మెల్యే వేగేశన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి బలం, బలగం కార్యకర్తలేనన్నారు. రాబోయే రోజుల్లో ప్రతిఒక్కరికి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ నెల 21న పార్లమెంట్ స్థాయి మహానాడు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కడప జిల్లాలో జరిగే మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. బాపుడా చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, నియోజకవర్గ పరిశీలకుడు బొంతు శివసాంబిరెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అద్దంకిలో ఆధ్యాత్మిక శోభ

శోభాయమానంగా కలశయాత్ర

వేడుకగా మహా కుంభాభిషేకం

అద్దంకి, మే 19 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి మహాకుంభాభిషేకం సందర్భంగా కలశయాత్ర సోమవారం శోభాయమానంగా సాగింది. అద్దంకి పట్టణంలోని పాత దర్శి రోడ్డులో గుండ్లకమ్మ నది వద్ద ఉన్న ఊట చలమల నుంచి జలాన్ని సేకరించారు. సోమవారం ఉదయం 6 గంటలకు ప్రారంభమైన కలశయాత్ర సుమారు 7 కి.మీ దూరంలో ఉన్న శింగరకొండకు ఉదయం 8.45 గంటలకు చేరింది. వర్షపు జల్లులు కురుస్తున్నప్పటికీ మహిళలు లెక్కచేయకుండా ముందుకుసాగారు. గజరాజుపై శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పూజారి శ్రీరామచంద్రమూర్తి కలశంతో ఆశీనులయ్యారు. యాత్రకు ఆటంకం లేకుండా నామ్‌రోడ్డులో ట్రాఫిక్‌ను మళ్లించారు.

వైభవంగా మహాకుంభాభిషేకం

ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో సోమవారం ఉదయం మహాకుంభాభిషేకం జీవ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ వైభవంగా జరిగాయి. ఉదయం కృష్ణ యజుర్వేద హవన సహిత మహాకుంభాభి షేకాన్ని శృంగేరిపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి తన శిష్య బృందంతో కలిసి నిర్వహించారు. విమాన శిఖర పూజలు, జీవ .ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను చేశా రు. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, బాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఇంటూరి నాగేశ్వరరావు, దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, కడియాల లలిత్‌సాగర్ దంపతులు, ఈవో తిమ్మానాయుడు, రిషిత దంపతులు పాల్గొన్నారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించు కున్నట్లు అంచనా. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలలో రాతి ముఖ మండపం ప్రధాన దాతలు నలమలపు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీదేవి, కోట శ్రీనివాసకుమార్, నాగలక్ష్మి, గుంజి కృష్ణారావు, రమాదేవి, కాట్రగడ్డ అనిల్‌కుమార్, శ్రీవిద్య, జీవధ్వజస్తంభం దాత మేదరమెట్ల శంకరారెడ్డితో పాటుకుమారులు రాజశేఖరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి దంపతులు పాల్గొన్నారు. చీరాల డీఎస్పీ మొయిన్, సీఐలు సుబ్బరాజు, మల్లికార్జునరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్





విమాన కలశం వద్ద పూజలు నిర్వహిస్తున్న శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీస్వామి

పాడి రైతుకు 'బీమా' రక్ష

(5వ పేజీ తరువాయి)

వంద వరకు వెసులుబాటు కల్పించింది. ఒక్కసారి బీమా చెల్లిస్తే మూడేళ్ల పాటు అది అమల్లో ఉండేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులన్నీ ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రాగా.. ఈ నెల మొదటి వారం నుంచి బీమా ప్రక్రియను యంత్రాంగం ముమ్మరం చేసింది.

ఎక్కువ శాతం బీమా గొడుకు కిందకు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న పశు సంపదలో దాదాపు 30 శాతం వరకైనా బీమా గొడుకు కిందకు తెచ్చేలా గ్రామాల్లో అవగాహన కల్పించే చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. పశుసంవర్ధక శాఖ లెక్కల ప్రకారం బాపట్ల జిల్లాలో ఆవులు, ఎద్దుల సంఖ్య 21,930గా ఉండగా, గేదెలు 3,81,764 ఉన్నాయి. గొర్రెలు 4,27,523, మేకలు 49,990, పందులు 3,219 కాగా కోళ్లు 7,76,022 ఉన్నాయి. పల్నాడు జిల్లాలో ఆవుల సంఖ్య 68,000, గేదెలు 4,69,048, గొర్రెలు 4,80,000, మేకలు 1,58,000, పందులు 1,800 నమోదై ఉన్నాయి. గుంటూరు జిల్లాలో గేదెల సంఖ్య 2,20,000 వరకు ఉండగా.. మేకలు, గొర్రెలు కలిపి మూడు లక్షల వరకు ఉన్నాయి. వీటన్నింటికీ బీమా కల్పించేలా పాడి రైతులకు అవగాహన కల్పించడానికి పశు సంవర్ధకశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతులను చైతన్య పరుస్తున్నారు

బకాయిలు చెల్లించి, పాడికి ఊతం

వైసీపీ ఏలుబడిలో అరకొరగా అమలు చేసిన పాడి సంబంధిత పథకాల బకాయిలను ఈ ప్రభుత్వం చెల్లించింది. బాపట్ల జిల్లాలో రూ.2కోట్ల వరకు పెండింగ్ మొత్తాలను చెల్లించగా గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు రూ.5 కోట్ల వరకు చెల్లించింది.బీమాను ఏడాది పొడవునా ఉధృతంగా అమలు చేసేలా పశుసంవర్ధక శాఖకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గడచిన మూడు నెలల వ్యవధిలో దాదాపు 3శాతం పశు సంపద వృద్ధి.. మూడు జిల్లాల్లో నమోదు కావడం గమనార్హం.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 512.70 అడుగులు ఉంది. ఇది 136.30 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 900, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

డిమాండ్ లేకున్నా.. తత్కాల్ కోటానా..!

● ఈ కారణంగా జనరల్, రిమోట్ లొకేషన్, తత్కాల్‌లో కోత ● రైల్వే నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని ప్రయాణికుల సూచన

గుంటూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మీదగా తిరుపతి, విశాఖపట్టణం, రాయగడ తదితర ప్రాంతాలకు ప్రయాణిస్తున్న అంతగా డిమాండ్ లేని రైళ్లలో రైల్వే శాఖ తాజాగా ప్రీమియం తత్కాల్ కోటాని జత చేసింది. దీని వలన ఇతర కోటాల్లో కోత పడింది. ఈ నిర్ణయం ఒక విధంగా మేలు చేసేలా ఉన్నా మరో రూపంలో నష్టం కలిగిస్తుంది. తత్కాల్/ప్రీమియం తత్కాల్ కోటాకు టిక్కెట్ల సంఖ్యని పెంచడం వలన జనరల్, రిమోట్ లొకేషన్ కోటాల్లో వాటి సంఖ్య తగ్గించాల్సిన పరిస్థితి తలెత్తింది. దీనివలన ప్రయాణికులకు ఎలాంటి ఉపయోగం జరగదు. కాగా ప్రీమియం తత్కాల్‌లో మిగిలిపోయిన టిక్కెట్లను తత్కాల్ వెయిటింగ్ లిస్టుని క్లియర్ చేయడానికి సర్దుబాటు చేస్తారు. జనరల్ కోటాలకు కూడా సర్దుతారు. ఈ కారణంగా జనరల్/తత్కాల్‌లో వెయిటింగ్ లిస్టులో బుకింగ్ చేసుకొన్న ప్రయాణీకులు ఛార్ట్ సిద్ధమయ్యే సమయం కోసం ఎదురు చూస్తూ గడపాలి.

నంబరు. 20702 తిరుపతి - సికింద్రాబాద్ వందేభా రత్ ఎక్స్‌ప్రెస్‌కి గతంలో జనరల్ కోటాలో ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్(ఈసీ) సీట్లు 44 ఉండేవి. ఇవి తాజాగా సవ రించి 28కి తగ్గించారు. గుంటూరు రిమోటల్ లొకేషన్ లో గతంలో ఎనిమిది ఉండేవి కాస్త ఇప్పుడు రెండు పెరిగి పది అయ్యాయి. తత్కాల్ మాత్రం గతంలో 16 ఉంటే దానిని ఇప్పుడు 21కి పెంచారు. ఏసీ చైర్‌కార్ సీట్లు గతంలో 603 జనరల్ కోటాలో ఉంటే ఇప్పుడు 474కి తగ్గించారు. గుంటూరు రిమోట్ లోకేషన్‌లో 120 నుంచి 100కి, తత్కాల్‌ని 158 నుంచి 209కి పెంచారు. రైల్వే శాఖ తీసుకొన్న ఈ నిర్ణయం వలన జనరల్ కోటాకు కోత పడి తత్కాల్‌కి పెరిగింది. ఇదేవిధంగా నంబరు. 17243 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్‌కు ఏసీ త్రీటైర్ జనరల్ కోటాని ఏడు నుంచి 15కి పెంచారు. తత్కాల్‌ని కూడా ఎనిమిది నుంచి 20కి పెంపుదల చేశారు. స్లీపర్ క్లాస్‌కు గతంలో ఉన్న 159ని 259కి పెంచారు. తత్కాల్‌ని అయితే ఏకంగా వంద పెంచి 95 నుంచి 195 బెర్తులు చేశారు.



నంబరు. 22875 విశాఖపట్టణం - గుంటూరు ఉద య్ ఎక్స్‌ప్రెస్‌కు జనరల్ కోటా సీట్లే 100 శాతం బుకింగ్ జరగవు. అలాంటిది ఇప్పుడు కొత్తగా ప్రీమియం తత్కాల్ కోటాని చేర్చారు. ఈ రైలుకు తత్కాల్‌కు గతంలో 100 సీట్లు ఉండేవి వాటిని ఇప్పుడు 70కి తగ్గించి మిగతా 30ని ప్రీమియం తత్కాల్ కోటాలో పెట్టారు. సెకండ్ సిట్టింగ్ సీట్లలో జనరల్‌లో 23 నుంచి 20కి తగ్గించి తత్కాల్ కోటాని ఆరు నుంచి తొమ్మిదికి పెంచారు. నంబరు. 17240 విశాఖపట్టణం - గుంటూ రు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌కు కూడా పెద్దగా డిమాండ్ ఉండదు. అయినప్పటికీ ఈ రైలుకు కూడా ప్రీమియం తత్కాల్ కోట పెట్టి ఏసీ చైర్ కార్ 5, సెకండ్ సిట్టింగ్ సీట్లు 20గా నిర్ణయించారు. ప్రీమియం తత్కాల్ కోటా లో పెట్టిన ఐదు ఏసీ చైర్‌కార్, 20 సెకండ్ సిట్టింగ్ సీట్లను జనరల్ కోటాలో కోత పెట్టి చేశారు. నంబరు. 22203 విశాఖపట్టణం - సికింద్రాబాద్ వయా గుంటూ రు దరంతో ట్రైవీక్లీ(వారంలో మూడు రోజులు) ఎక్స్‌ప్రెస్‌కి డిమాండ్ చాలా తక్కువగా ఉంటుంది. దీనిని కూడా ప్రీమియం తత్కాల్ కోటాని చేర్చారు. ఏసీ టూటైర్ 20, ఏసీ త్రీటైర్ 50, సెకండ్ సిట్టింగ్ మూడు సీట్లన ప్రీమియం తత్కాల్ కోటాలో పెట్టడం వలన జనరల్ కోటాకు కోత పడింది. కేవలం ఆదాయం పెంచుకోవడానికే రైల్వే శాఖ ఈ విధంగా ప్రీమియం తత్కాల్ కోటాని పైన పేర్కొన్న రైళ్లకు నిర్దేశించిందన్న అభిప్రాయం ప్రయాణికుల నుంచి వ్యక్తమవుతున్నది. దీని వలన ప్రయాణికులకు ఒరిగేది ఏమి ఉండదని, ఈ నిర్ణయాన్ని రైల్వే శాఖ సమీక్షించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

భూ సమీకరణకు అంగీకరిస్తే ఈ ఏడాది నుంచే కౌలు

● లింగాపురం రైతులతో ఎమ్మెల్యే ప్రవీణ్



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): రెండవ దఫా రాజధాని అమరావతికి భూ సమీకరణ ద్వారా భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరిస్తే.. ఈ ఏడాది నుండే కౌలు అందజేయడం జరుగుతుందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని లింగాపురంలో గ్రామంలో భూ సమీకరణపై గ్రామ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రవీణ్ పాల్గొని రైతుల వినతులకు సమాదానం ఇచ్చారు. రాజధాని రైతులకు ఇచ్చిన ప్యాకేజీ ప్రకారమే రెండవ దఫా భూ సమీకరణ రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. మూడు గ్రామాలను యూనిట్‌గా రిటర్నబుల్ ప్లాట్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు జరిగిన పది గ్రామాల్లో రైతులు భూ సమీకరణకు సుముఖత వ్యక్తం చేశారని.. లింగాపురంతో పాటు అమరావతి, ధరణికోట రైతులు కూడా భూ సమీకరణకు అంగీకరిస్తే ముఖ్యమంత్రితో మాట్లాడి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే చెప్పారు. తమకు కేటాయించే రిటర్నబుల్ ప్లాట్‌ల సమీపంలోనే ఐటీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, కౌలు రూ.40వేలు ఇవ్వాలని, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు న్యాయం చేయాలని, పెన్నా కాలువ వెళ్లే భూములను సమీకరణ ద్వారా తీసుకోవాలని, రిటర్నబుల్ ప్లాట్‌లను మెరక ప్రాంతంలో కేటాయించాలని, చదువుకున్న ప్రతి నిరుద్యోగికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఇలా తమ డిమాండ్లను సభ ముందుంచారు. ఎమ్మెల్యే ప్రవీణ్ సమాదానం ఇస్తూ రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. సుమారు 100 ఎకరాలకు చెందిన పలువురు రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకాల జిరాక్స్ కాపీలను ఎమ్మెల్యేకు అందజేశారు. తహసీల్దారు డానియేలు, ఎంపీడీఓ పార్వతి, సర్వేయర్ భాగ్యలక్ష్మి, సర్పంచ్ కె.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక బోధన పద్ధతులపై అవగాహన అవసరం

● ప్రొఫెసర్ బాలగణపతి దేవరకొండ

గుంటూరు (విద్య) మే 19 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకులకు పరిశోధన, డేటా విశ్లేషణ, అకడమిక్ రచన, పాలసీ అనుసంధానంతో పాటు ఆధునిక బోధన పద్ధతులపై లోతైన అవగాహన అవసరమని యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ ఫిలాసఫీ ప్రొఫెసర్ బాలగణపతి దేవరకొండ పేర్కొన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) ఆర్థిక సౌజన్యంతో చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో "ఏ టూ వీక్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం ఫర్ ఫ్యాకల్టీ ఇన్ సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ ఆన్ ఎన్‌హ్యాన్సింగ్ మెథడోలాజికల్ ఎక్స్‌పర్టైజ్ అండ్ టెక్నాలజికల్ అడాప్షన్" అనే అంశంపై రెండు వారాల కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. వర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లిష్ అండ్ అదర్ ఇండియన్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ ఆధ్యర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోంది. ముఖ్య అతిథి ప్రొఫెసర్ బాలగణపతి దేవరకొండ మాట్లాడుతూ గుణాత్మక, పరిమాణాత్మక పద్ధతులపై శిక్షణతోపాటు కేస్ స్టడీ, ఫీల్డ్ రిసెర్చ్ విధానాలపై మెథడాలజికల్ ట్రైనింగ్ అవసరమన్నారు. ఎన్ఐఏ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీఎస్ఆర్ ప్రభు, వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఆచార్య బాల గణపతి దేవరకొండ

పెదకొండాయిపాలెంలో 20 మందికి డయేరియా

ఈపూరు,మే19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొండాయిపాలెంలో సుమారు 20 మంది డయేరియాతో బాధపడుతూ విలేజ్ క్లీనిక్‌లో చేరారు. అక్కడ వైద్య సిబ్బంది వారికి చికిత్స చేశారు. గ్రామంలో మరికొందరు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నట్లు వైద్య సిబ్బందికి తెలియడంతో వారు జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంఅండ్‌హెచ్‌ఓ రవి, డీపీఓ నాగేశ్వరరావు నాయక్ గ్రామానికి వచ్చి.. రోగులను పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. మురుగు కాల్వలను పరిశీలించారు. గ్రామంలో జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొన్న వారు పెట్టిన చలిమిడి, సజ్జలు తినడం వల్లే అనారోగ్యానికి గురైనట్లు వైద్య, ఆరోగ్య సిబ్బంది తెలిపారు. తహసీల్దారు ఎ.నళిని, ఎంపీడీఓ కె.ప్రభాకర్ గ్రామాన్ని సందర్శించారు. పంచాయతీ కార్యదర్శి బి.కృష్ణాంజనేయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రోగులకు కొచ్చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, పీహెచ్ఎన్ లక్ష్మీనర్సమ్మ వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం గ్రామంలో డయేరియా అదుపులో ఉందని వైద్యులు తెలిపారు.



గ్రామంలో పర్యటిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ,పంచాయితీ,రెవెన్యూ అధికారులు

కేఎల్‌యూ మహిళా లిఫ్టర్లకు పతకాలు



లిఫ్టర్లను సన్మానిస్తున్న కేఎల్‌యూ యాజమాన్యం

తాడేపల్లి (వడ్డేశ్వరం), మే 19 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ యూనివర్సిటీ క్లాసిక్ లిఫ్టింగ్ కప్, ఏషియన్ సబ్ జూనియర్, జూనియర్ పురుషులు, మహిళల చాంపియన్ షిప్ టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన కేఎల్‌యూ మహిళా లిఫ్టర్లు స్క్వాడ్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్‌లో ప్రతిభ కనబరిచి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. డెహ్రాడూన్‌లో ఆదివారం జరిగిన ఏషియన్ యూనివర్సిటీ క్లాసిక్ లిఫ్టింగ్ కప్ 47 కిలోల విభాగంలో ఎం.షానూన్, 84 ప్లస్ విభాగంలో నగం జ్ఞానదివ్య, 84 కిలోల విభాగంలో షేక్ సబీనా స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నారు. ఏషియన్ సబ్ జూనియర్, జూనియర్ పురుషులు, మహిళల చాంపియన్ షిప్ టోర్నీలో 47 కిలోల విభాగంలో మదిర షానూన్ కాంస్యం, 84 ప్లస్ కిలోల విభాగంలో నగం జ్ఞానదివ్య రజతం, 84 కిలోల విభాగంలో షేక్ సబీనా స్వర్ణ పతకాలు సాధించారు. డీన్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, స్పోర్ట్స్ డైరెక్టర్ కాకర్ల హరికిషోర్, ప్రో వీసీలు డాక్టర్ రాజశేఖర్, ప్రసాద్, వెంకట్రామ్, రిజిస్ట్రారు సుబ్బారావు, వీసీ సారథివర్మ వారిని అభినందించారు.

42 సవర్ల బంగారం రికవరీ



మాట్లాడుతున్న నరసరావుపేట డీఎస్పీ కే నాగేశ్వరరావు

చిలకలూరిపేట, మే19 (ఆంధ్రజ్యోతి): మండలం పసుమర్రు గ్రామంలో వారం రోజుల కిందట జరిగిన భారీ దొంగతనం కేసును చిలకలూరిపేట రూరల్ పోలీసులు ఛేదించారు. నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు సోమవారం కేసు వివరాలు వెల్లడించారు. యలగాల హనుమాయమ్మ అనే మహిళ ఇంటిలో దొంగతనం జరిగింది. సుమారు రూ.34 లక్షలు విలువ చేసే 42 సవర్ల బంగారు నగలు, సుమారు 60 గ్రాముల వెండి వస్తువులు, రాగి, ఇత్తడి సామగ్రిని దుండగులు చోరీ చేశారు. ఈ నెల 11న కేసు నమోదయింది. చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు ఆధ్వర్యంలో రూరల్ ఎస్సై జి.అనిల్ కుమార్ ఇతర సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. చిలకలూరిపేటలోని డైక్ మన్ కాలనీకి చెందిన పేదాల రాముడు, మదర్ థెరిసా కాలనీకి చెందిన బీరా సిద్దు అనే ఇద్దరు యువకులను అరెస్ట్ చేశారు. వారి నుంచి దొంగిలించిన మొత్తం సొత్తును రికవరీ చేశారు. రాముడుపై చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్లో గతంలో ఒక దొంగతనం కేసు, నరసరావుపేట, బల్లికురవ పోలీస్ స్టేషన్లలో బైండోవర్ కేసులు ఉన్నాయి. పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు, డీఎస్పీ, సీఐ బి.సుబ్బానాయుడు, ఎస్సై జి.అనిల్‌కుమార్, ఏఎస్ఐలు డి.రోసిబాబు, జి.సుబ్బారావు, హెడ్ కానిస్టేబుళ్లు దేవరాజు, శ్రీధర్, కానిస్టేబుళ్లు ఇర్మియా, అశోక్, రత్న కిషోర్, హోంగార్డు మధుబాబులను అభినందించారు.

లారీని ఢీకొని ద్విచక్రవాహనదారుడి మృతి

వినుకొండటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతిచెందిన ఘటన మండలంలోని చీకటీగలపాలెం గ్రామ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఓ దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్న నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామానికి చెందిన కటికల విజయ్‌కుమార్ (28) పని ముగించుకుని తన బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. స్థానికులు వైద్యం నిమిత్తం అతనిని వినుకొండకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య ఉంది.

సైకిల్‌పై కడప మహానాడుకు ప్రయాణం

మరోసారి అభిమానం చాటిన షేక్ బాజీ

పిడుగురాళ్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): షేక్ బాజీ అనే టీడీపీ కార్యకర్త సోమవారం గురజాల నియోజకవర్గం పిడుగురాళ్ల నుంచి కడపలో జరిగే టీడీపీ మహానాడుకు చేరుకోవడానికి సైకిల్‌పై యాత్ర ప్రారంభించారు. గతంలో కూడా మహానాడు ఎక్కడ జరిగినా అక్కడికి సైకిల్‌పై వెళ్లి పార్టీ పట్ల అభిమానం చాటుకున్నాడు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు జెండా ఊపి అతని సైకిల్ యాత్రను ప్రారంభించారు. పార్టీ పట్ల బాజీ నిబద్ధత, పట్టుదల అందరికీ స్ఫూర్తిదాయకం అని అతనికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, యువ నేత నిఖిల్ అభినందనలు తెలిపారు. సాయంత్రం వినుకొండలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును బాజీ కలిశారు. బాజీ చేపట్టిన సైకిల్ యాత్రను జీవీ అభినందించారు.



వినుకొండలో బాజీని అభినందిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

విద్యుదాఘాతంతో రైతు మృతి

నాదెండ్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విద్యుదాఘాతంతో చేకూరి హనుమంతరావు(70) అనే రైతు సోమవారం సాయంత్రం మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఆయనకు నాదెండ్ల - తూబాడు మార్గం సమీపంలో వ్యవసాయ క్షేత్రం ఉంది. మధ్యాహ్నం వర్షం కురిసిన సమయంలో.. పొలాన్ని చూసేందుకు వెళ్లాడు. పొలానికి వేసిన ఫెన్సింగ్‌కు విద్యుత్ సరఫరా ఉన్న విషయాన్ని గుర్తించలేదు. సర్వీసు వైరు గాలి రాపిడికి తెగడంతో... హనుమంతరావు విద్యుదాఘాతానికి గురయ్యాడు. చుట్టు పక్కల రైతులు వెంటనే ఆయనను చిలకలూరిపేట ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. నాదెండ్ల పోలీసులు విచారణ చేపట్టారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



గోపి మృతదేహం

మాచర్లటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. కారెంపూడికి చెందిన వద్దుల గోపి (28)కి మాచర్ల పట్టణంలోని సుద్దగుంతలకు చెందిన కోటేశ్వరితో పదేళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో..వారు పది నెలల క్రితం మాచర్ల పట్టణంలోని సుద్దగుంతలకు నివాసం వచ్చారు. పట్టణంలోని ఓ సెలూన్ పనిచేస్తున్న గోపీ.. మద్యానికి బానిస కావడంతో మూడు రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో భార్య కోటేశ్వరి పట్టణంలోని తన తల్లి ఇంటికి వెళ్లిపోయింది. రాత్రి గోపీ తన స్నేహితుడు సురేష్‌కు ఫోన్ చేసి టిఫిన్ తీసుకురమ్మని చెప్పాడు. సురేష్ ఇంటికి వెళ్లి చూడగా.. అప్పటికే గోపీ ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకొని అపస్మారక స్థితిలో కనిపించాడు. చుట్టుపక్కల వారి సాయంతో గోపీని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బొలెరో ఢీకొని టీడీపీ కార్యకర్త మృతి



మృతుడు కుందూరు బ్రహ్మయ్య

తాడేపల్లి (ఉండవల్లి), మే 19 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి - పెనుమాక మార్గ మధ్యలో ఉండవల్లి గుహలకు సమీపంలో అతి వేగంతో వెళ్తున్న బొలెరో ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలను, కరెంటు స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న పెనుమాకకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త కుందూరు బ్రహ్మయ్య (60) మృతి చెందగా.. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. బొలెరో డ్రైవర్ మల్కాపురానికి చెందిన నరేష్ మద్యం మత్తులో ఉండటం వల్లే ఈ ఘటన జరిగిందని తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజ్ తెలిపారు. బ్రహ్మయ్యకు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. బ్రహ్మయ్య మృతిపట్ల టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు నాయకులు సంతాపం తెలిపారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఈఏపీ సెట్

గుంటూరు (విద్య) మే 19 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చరల్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించే ఈఏపీ సెట్ సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. గుంటూరు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 22 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. బాపట్లలో 2, పల్నాడు జిల్లాలో 5, గుంటూరు జిల్లాలో 15 కేంద్రాలు ఉన్నాయి. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 3,575 మంది విద్యార్థులు హాజరయ్యారు. మంగళవారం కూడా ఫార్మసీ, అగ్రికల్చర్ పరీక్ష నిర్వహించనున్నారు. 21 నుంచి 27వ తేదీ వరకు ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు జరుగుతాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

● ఎస్పీ తుషార్ డూడి ● పీజీఆర్ఎస్‌కు 50 అర్జీలు



అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల,మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారవేదికకు వచ్చే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు సమస్యల పరిష్కారం కోసం 50మంది అర్జీలు అందజేశారు. అర్జీదారుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఎస్పీ మాట్లాడుతూ అర్జీలను చట్టపరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలన్నారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, భూవివాదాలు, ఇతర సమస్యలకు సంబంధించి అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుదారులందరికీ పట్టాలు మంజూరు చేయాలి : మేకల

బాపట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం వెదుళ్ళపల్లి పంచాయతీ కొల్లా వెంకయ్య కాలనీలో నివాసం ఉంటున్న ప్రజలకు జీవోనెంబరు 30 ప్రకారం అర్జీలు పెట్టిన వారందరికి పట్టాలు మంజూరు చేయాలని అఖిల భారత రైతు కూలీసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ కోరారు. ఈ విషయమై సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధిత కుటుంబాల వారితో కలిసి అర్జీ అందజేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జీవో నెంబరు 30ని చిత్తశుద్ధిగా అమలు చేసి పట్టాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ కార్యదర్శి మువ్వల పల్లవి,చిన్న, ఎస్‌డి హఫీ, మువ్వల రాఘవులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

టన్ను ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం



ప్లాస్టిక్ గ్లాసులు, క్యారీబ్యాగ్‌లను స్వాధీనం చేసుకుంటున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణ తదితరులు

బాపట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహిత పట్టణంగా బాపట్లను తీర్చిదిద్దే క్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆదేశాలతో సోమవారం శానిటరి సిబ్బంది బాపట్లలో మరోసారి దాడులు నిర్వహించారు. ప్లాస్టిక్ గ్లాసులు, క్యారీబ్యాగ్‌లు, ఇతర వస్తువులు విక్రయిస్తున్న దుకాణాలలో శానిటరి ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.కరుణ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. వారి నుంచి టన్ను బరువు ఉన్న ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనంచేసుకున్నారు. శ్రీ జయలక్ష్మీ ట్రేడర్స్‌కు రూ.5 వేలు, శ్రీవేంకటశ్రీనివాస ట్రేడర్స్‌కు రూ.10 వేల జరిమాన విధించారు. రెండోసారి కూడా దొరికితే జరిమానకు అదనంగా రూ.2 వేలు చొప్పున పెంచుకుంటూపోతామని ఆమె తెలిపారు.

డీఈవో కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలి

బాపట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం సాచివేత ధోరణి అనుసరిస్తున్నదని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. స్థానిక రాష్ట్రోపాధ్యాయ కార్యాలయం దగ్గర సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన డీఈవో కార్యాలయం ముట్టడి చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన విధానాల్ని ఈ ప్రభుత్వం కూడా అనుసరిస్తున్నదన్నారు.కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జె.వినయ్‌కుమార్, ఏపీటీఎఫ్ నాయకుడు సయ్యద్ చాంద్‌బాషా, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాసరావు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి జంపని శ్రీనివాసరావు, విజయబాబు, సురేష్, సుభానీ, నాగరాజు, నారాయణ పాల్గొన్నారు.

రేపు జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం : కలెక్టర్

బాపట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశం మందిరంలో నిర్వహిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జిల్లాలో రాష్ట్రప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారధి సమీక్షిస్తారన్నారు. ఈ సమావేశానికి జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులపై పూర్తి సమగ్ర సమాచారంతో హాజరుకావాలని కలెక్టర్ కోరారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఒక అర్జీ

కర్లపాలెం, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతిసోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదికను ఉపయోగించుకోవాలని తహసీల్దార్ సుందరమ్మ అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారవేదికలో పట్టాదారు పాస్ పుస్తకం కోసం ఒక దరఖాస్తు వచ్చిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, సీహెచ్‌వో మేరీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జూన్ 9 వరకు ప్రత్యేక అవసరాల చిన్నారుల నమోదు

కర్లపాలెం, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాలు గల పిల్లల నమోదు కార్యక్రమం మే 13 నుంచి జూన్ 9 వరకు జరుగుతుందని ఈ అవకాశాన్ని ప్రత్యేక అవసరాల చిన్నారుల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని ఐఈఆర్టీ ఉపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బందిని కలుపుకొని కొత్తగా ఎవరైనా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు ఉన్నారేమో సర్వే చేయటం జరుగుతుందని ఆమె తెలిపారు.

ఉప ఎంపీపీగా దొంతిరెడ్డి సింధు

పిట్టలవానిపాలెం,మే 19 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షురాలిగా దొంతిరెడ్డి సింధు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో డ్వామా పీడీ, ఎన్నికల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం ఈ ఎన్నికను నిర్వహించారు. మండలంలోని 11 మంది ఎంపీటీసీలకు గాను 9 మంది హాజరయ్యారు. వీరిలో ఎంపీపీగా దెందుకూరి సీతారామరాజు ఉన్నారు. భవనంవారిపాలెం ఎంపీటీసీ దొంతిరెడ్డి సింధును ఎంపీటీసీలందరూ ఉప ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.ఏలీషాబాబు, మండల పరిషత్ సూపరింటెండెంట్ బి.మధుసూధనరెడ్డిలు ఈ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలతోపాటు ఆయా గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కాల్వల మరమ్మతుల ప్రారంభం



న్యూ ముత్తాయపాలెం ఛానల్ మరమ్మతులు ప్రారంభిస్తున్న డీసీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షుడు సోమరాజు

బాపట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఓ అండ్ ఎం నిధులు వెచ్చించి బాపట్ల మండలంలోని ఇరిగేషన్ ఛానల్స్ మరమ్మతులు ప్రారంభించారు. డీఈఈ ఎస్‌కె.జాకీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఏఈఈ వెంకటరమణ సిబ్బందితో కలిసి చెరువు ఉప్పరపాలెంలో పీటీ ఛానల్ కట్టలు పటిష్ఠం చేసే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. అదేవిధంగా న్యూ ముత్తాయపాలెం ఛానల్ మరమ్మతులను డీసీ అధ్యక్షుడు మల్లారపు శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షుడు పిన్నిబోయన సోమరాజులు లాంఛనంగా ప్రారంభించారు. మొత్తం పనులు పూర్తిస్థాయిలో చేపట్టి ఖరీఫ్‌లో రైతులకు సాగునీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం డైరెక్టర్‌లు ఆదినారాయణ, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సన్మానించిన ఏఎన్‌పీఎస్ నాయకులు



కలెక్టర్‌ని సన్మానించి మెమొంటోతో సత్కరిస్తున్న డాక్టర్ జి.చార్వాక, ఇతర నాయకులు

బాపట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కలెక్టర్ జె.వెంకటమురళికి అవార్డు లభించటం హర్షణీయమని ఏఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక అన్నారు. సోమవారం కలెక్టర్ జె.వెంకటమురళిని సంఘ నాయకులతో కలిసి ఘనంగా సన్మానించి మెమొంటోతో సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్‌బాబు, మంచాల ఆనంద్‌బాబు, దాసి నాగేశ్వరరావు, చంటిబాబు, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి

● పీజీఆర్ఎస్‌కు 170 అర్జీలు



అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారవేదికకు వచ్చేవారి అర్జీలను నిశితంగా పరిశీలించి పరిష్కారం చూపించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్దఎత్తున వచ్చి తమ సమస్యలను అర్జీల ద్వారా కలెక్టర్‌కు వివరించారు. మొత్తం 170 అర్జీలు నమోదయ్యాయి. అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా విని కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. తన పరిధిలో లేనివాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతామన్నారు. కొన్నిటిని క్షేత్ర స్థాయి పరిశీలనకు, మరికొన్నిటిని విచారించాలని అధికారులను ఆదేశించారు. పరిష్కారమైన అర్జీకి సంబంధించిన సదరు ఫిర్యాదుదారుడి ఇంటికెళ్ళి ఫొటో అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. ఏపీఎఫ్ఆర్ఎస్ ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఆన్‌లైన్ హాజరు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు

రేపల్లె, మే 19(ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదికను డివిజన్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం ఆరు ఫిర్యాదులు అందాయని తెలిపారు. చుండూరు మండలం యడ్లపల్లికి చెందిన లింగినేని కృష్ణమూర్తి తమ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిందిగా కోరారు. రేపల్లె మండలం శింగుపాలేనికి చెందిన యార్లగడ్డ రుక్మిణి, చంద్రశేఖర్, మధుసూదన్‌రావు అనే వారు తమ భూములను ఆన్‌లైన్ నమోదు చేయాల్సిందిగా కోరుతూ అర్జీలను దాఖలు చేశారు. పెనుమూడి గ్రామానికి చెందిన అవనిగడ్డ గంగాధర్ మూడుసెంట్ల ఇంటి నివేశన స్థలం కలదని ఇంటిముందు ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని, ఆక్రమణ తొలగించాలని కోరారు. పట్టణంలోని 14వ వార్డుకు చెందిన పిల్లి రాజేంద్రప్రసాద్, వెంకటకృష్ణకి చెందిన ఆరుసెంట్ల ఇంటి నివేశన స్థలం కలదని సదరు స్థలం సర్వేనెంబర్ దేవదాయ శాఖ భూమిలో నమోదైందని, సర్వేనెంబర్‌ను ఎండోమెంట్ నుంచి తొలగించాలని కోరారు. పోతార్లంకకు చెందిన నాదెళ్ళ అరుణకుమారి 1.10 సెంట్ల భూమి కలదని, సర్వే చేయగా మూడున్నర సెంట్లు తగ్గిందని, సర్వే చేసి మూడున్నర సెంట్లు చూపించాల్సిందిగా కోరారు. ఈ అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.



ప్రజాసమస్యల పరిష్కారవేదికలో అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

సారా రహిత జిల్లాగా బాపట్ల : కలెక్టర్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు

బాపట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్లను సారారహిత జిల్లాగా తయారు చేయటానికి లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులంతా కృషి చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. జిల్లాలో నాటుసారా నిర్మూలనపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులను ఆరా తీశారు. జిల్లాలో బాపట్ల, చీరాల, స్టూవర్టుపురంలలో ఎస్టీలు ఎక్కువగా ఉన్నందున అక్కడకు తనిఖీలకు వెళ్ళిన సమయంలో వారు అట్రాసిటి కేసులు పెడతామని బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నట్లు కలెక్టర్‌కు అధికారులు వివరించారు. సారా తయారీ, అమ్మకాలు, రవాణా విషయంలో మూడు విభాగాలకు సంబంధించి 16 గ్రామాలు సమస్యాత్మకంగా ఉన్నాయని ఎక్సైజ్ శాఖాధికారులు కలెక్టర్‌కు వివరించారు. రాబోయే 15 రోజుల్లో జిల్లాలో నాటుసారా తయారు చేసే సమస్యాత్మకమైన 16 గ్రామాలలో వీఆర్వో, పంచాయతీ సెక్రటరి, పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. నాటుసారా తయారీ మానుకున్నట్లైతే వారికి జీవనోపాధులు మెరుగుపర్చటానికి బ్యాంక్ రుణాలు అందించటానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, ఆర్డీవో పి.గ్లోరియా, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బీఎస్ నారాయణభట్టు పాల్గొన్నారు.

25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులు

రైతులకు మద్దతు ధర కల్పించటంలో భాగంగా 25 వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం ఆమోదించిందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జిల్లా అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలో కలెక్టర్ సమావేశమయ్యారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు నుంచి సేకరించాలని జిల్లాకు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 29 వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరించటం జరిగిందన్నారు. బయట మార్కెట్‌లో ధాన్యం ధరలు తగ్గటం, అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు నష్టపోతున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళటం జరిగిందన్నారు. జిల్లాలో అత్యధికంగా ధాన్యం పంట సాగుఅవుతున్న నేపథ్యంలో ధాన్యం సేకరణ లక్ష్యం పెంచేలా అనుమతులివ్వాలని పలు మార్లు ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. స్పందించిన ప్రభుత్వం తాజాగా 25వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులిచ్చిందన్నారు.

● పీ4 విధానంలో బంగారు కుటుంబాల మార్గదర్శిలను అనుసంధానించే ప్రక్రియ చేపట్టాలని ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. బంగారు కుటుంబాలకు మార్గదర్శిలు అందించే సహాయం ఎలా చేరవేయాలో ప్రణాళికలు రూపొందించాలన్నారు. నీటితీరువా వసూళ్ళ జిల్లాలో రూ.19 కోట్లు లక్ష్యం కాగా గడిచిన 10 రోజుల్లో రేపల్లె డివిజన్ పరిధిలో రూ.75 లక్షలు, బాపట్ల డివిజన్ పరిధిలో రూ.27 లక్షలు, చీరాల డివిజన్ పరిధిలో రూ.11 లక్షలు వసూళ్ళు చేశామన్నారు. మిగిలినవి లక్ష్యం మేరకు వసూళ్ళు చేయాలన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద పట్టణాలలో 2,500 యూనిట్‌లు స్థాపించాలని మున్సిపల్ కమిషనర్‌లకు లక్ష్యాలను నిర్దేశించామన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఎంపీడీవోకు 1500 యూనిట్‌లను లక్ష్యంగా ఇచ్చామన్నారు. గృహనిర్మాణ లక్ష్యాలను వేగంగా పూర్తిఅయ్యేందుకు పొజిషన్ సర్టిఫికెట్‌లు జారీలో జాప్యం ఉండరాదన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా అధికారులు, తహసీల్దార్‌లు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించాలి : కలెక్టర్

జాతీయ యోగా దినోత్సవాన్ని ఈనెల 21వ తేది ఉదయం 5 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జాతీయ యోగా దినోత్సవం, ప్రభుత్వ సేవలు తదితర అంశాలపై అమరావతి నుంచి రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్ వీక్షణా సమావేశం ద్వారా సోమవారం పలు సూచనలు చేశారు. కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ యోగా దినోత్సవంపై ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. యోగా కార్యక్రమాన్ని హాజరైన వారంతా యాప్‌లో తమ పేర్లు నమోదు చేసుకోగానే ప్రభుత్వం నుంచి ధ్రువీకరణపత్రాలు అందుతాయన్నారు. ప్రజాప్రతినిధులు సైతం కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. నెలరోజులపాటు యోగా కార్యక్రమాలను అన్నిప్రాంతాలలో నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి నియామకం



శ్రీనివాసరెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మార్కెట్‌యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డికి నియామక జీవో పత్రాన్ని సోమవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అందజేశారు. పలువురు అభినందనలు తెలిపారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

బాపట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, దక్షిణ భారత కమ్యూనిస్ట్ ఉద్యమనిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి మార్గదర్శకమని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. సుందరయ్య 40వ వర్ధంతిని వెదుళ్ళపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలిసి ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో గంగయ్య మాట్లాడుతూ భూస్వామ్య దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా, పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాలపై సుందరయ్య అలుపెరగని పోరాటం చేశారన్నారు. జిల్లా నాయకులు ఎన్.కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, సాయిబురెడ్డి, కోట వెంకటేశ్వర్లురెడ్డి, బి.తిరుమలరెడ్డి, కె.శరత్, బి.దినేష్ తదితరులు పాల్గొన్నారు.

● కొల్లూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తోకలవానిపాలెం గ్రామంలో సుందరయ్య చిత్రపటానికి సీపీఎం నాయకుడు టి.కృష్ణమోహన్, యూటీఎఫ్ నాయకుడు పరిశుద్ధరావు సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుడు, ఉద్యమనేత సుందరయ్య స్ఫూర్తితో సమసమాజ స్థాపన కోసం యువత కృషి చేయాలన్నారు. యూటీఎఫ్ నాయకులు పరిశుద్ధరావు మాట్లాడుతూ ఆయన వర్ధంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.సుబ్బారావు, ఐద్వా నాయకురాలు దివ్య, పంచాయితీ సిబ్బంది కోటేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ నవీన్ పాల్గొన్నారు.

● రేపల్లె, మే 19(ఆంధ్రజ్యోతి) : స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ సీపీఎం ప్రజాసమస్యల పోరాటంలో ముందంజలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు డానియేలు, వై.కిషోర్, కె.ఆశీర్వాదం, కె.సాయిప్రసాద్, కేవీ లక్ష్మణ్‌రావు, ఎం.వెంకటేశ్వరరావు, కె.వెంకట్రావు పాల్గొన్నారు.

పది అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభం

చెరుకుపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి) : సోమవారం నుంచి 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు జడ్‌పీహెచ్‌ఎస్ చెరుకుపల్లి, జడ్‌పీహెచ్‌ఎస్ గుళ్ళపల్లి కేంద్రాలలో నిర్వహిస్తున్నారు. తెలుగు పరీక్షకు 93 మంది విద్యార్థులకు 35 మంది హాజరయ్యారని, 58 మంది గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి పి.లాజరు తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆర్.శోభాచంద్ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆర్థిక సహాయం

అమృతలూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు దాతలు సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి క్రొత్తపల్లి జయప్రద, హేమలత జ్ఞాపకార్థం విశ్రాంత ఉపాధ్యాయుడు మాధవరావు విద్యార్థులకు వరుసగా రూ.3500, రూ.2500, మైనేని హైమావతి జ్ఞాపకార్థం మనుమడు మహంత్ తృతీయ స్థానం సాధించిన ఇరువురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2000 అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నిరీక్షణరావు, మైనేని రత్నప్రసాద్, భ్రమర సూర్యశ్రీ, ఎం.వెంకటేశ్వరరావు, కె.భాస్కరరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం

పిట్టలవానిపాలెం, మే 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జాతీయ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బాపట్ల డ్వామా పీడీ విజయలక్ష్మి సమావేశం నిర్వహించారు. సోమవారం కార్యాలయంలో ఆమె ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లతో మాట్లాడుతూ గ్రామాలలో ఉపాధి హామీ పనులు కూలీలతో సమగ్రంగా నిర్వహించాలని ఆదేశించారు. ఏపీఎం గణపతి, ఇన్‌చార్జి ఎంపీడీవో ఏ.ఏలీషాబాబు, ఉపాధి హామీ పనులపై ఫీల్డ్ అసిస్టెంట్‌లతో ఆమె మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీరు, సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఫీల్డ్‌అసిస్టెంట్‌లకు తెలియజేశారు.

మినీమహానాడుకు తరలివెళ్ళిన నాయకులు

పిట్టలవానిపాలెం, మే 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ మహానాడుకు టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్ ఆధ్వర్యంలో సోమవారం అధిక సంఖ్యలో తరలి వెళ్ళారు. కార్యక్రమంలో మండల తెలుగుమహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, తదితర నాయకులు వెళ్ళారు.

వేమూరుకు...

భట్టిప్రోలు, కొల్లూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : వేమూరులో సోమవారం ఏర్పాటు చేసిన మినీ మహానాడుకు కొల్లూరు, భట్టిప్రోలు మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు మండల స్థాయి నాయకత్వం ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా తరలివెళ్లారు.

వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా అనురాధ

● వైస్ చైర్మన్‌గా గోగినేని వసుధ



మత్తి అనురాధ



గోగినేని వసుధ

రేపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి) : రేపల్లె నియోజకవర్గంలో వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లను నియమిస్తూ వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ కమిటీ సోమవారం ఉత్తర్వులను జారీ చేసింది. మంత్రి అనగాని సత్యప్రసాద్ గౌరవాధ్యక్షుడిగా, రేపల్లె మార్కెట్ యార్డు చైర్మన్‌గా జనసేన పార్టీకి చెందిన మత్తి అనురాధని, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా గోగినేని వసుధను నియమిస్తూ అధికారికంగా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులను జారీచేసింది. వీరితోపాటు మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా ఎ.అంజనీదేవి, బందరు ప్రభు, గోగినేని సురేష్, లచ్చి అరుణ, మద్దుల కృష్ణవేణి, గరికపాటి ప్రేమావతి, రావూరి అప్పయ్య, శౌంరి వరలక్ష్మి, వీరంకి సాంబశివరావు, వేము ఇశ్రాయేల్, జొన్నాదుల వెంకటేశ్వరరావు, సుగ్గుల సుదర్శన్‌రావు, యలవర్తి లక్ష్మిలను డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నూతన కార్యవర్గం మాట్లాడుతూ తమపై నమ్మకంతో మంత్రి అనగాని సత్యప్రసాద్ అవకాశం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పూజలో పాల్గొన్న అనగాని శివప్రసాద్, టీడీపీ నాయకులు

నగరం, మే 19(ఆంధ్రజ్యోతి) : స్వయంభుగా వెలసిన శ్రీలక్ష్మీపద్మావతి వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవటం ద్వారా మానసిక ప్రశాంతత ఉంటుందని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. సోమవారం నగరం గిరిపురంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఆయన పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయకమిటీ సభ్యులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగ తం పలికారు. ఆయన మాట్లాడుతూ ఈ దేవాలయం దినదినాభివృద్ధి చెందు తూ శ్రీవారి భక్తులకు అందుబాటులో ఉండటం సంతోషకరమన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ జగదీష్‌కుమార్ మాట్లాడుతూ ఆలయానికి విద్యుత్ లేకపోవటం తో చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలియజేయగా వెంటనే స్పం దించి సాధ్యమైనంత వరకు త్వరితగతిన సమస్యలు తీరుస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు కొలసాని రాము, లుక్కా గుడారంకయ్య, మట్టా శ్రీను పాల్గొన్నారు.

రేపు రేపల్లెలో మినీ మహానాడు

చెరుకుపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి) : రేపల్లె నియోజకవర్గస్థాయి మినీమహానాడు కార్యక్రమాన్ని ఈనెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు రేపల్లెలోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నట్లు చెరుకుపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొంటారని చెప్పారు. మండలంలోని నేతలు, వివిధ పదవులలో ఉన్న వారు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జనసేన కార్యకర్తకు ఆర్థిక సహాయం

అమృతలూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : చెట్టు పై నుంచి కింద పడి గాయపడిన జనసేన కార్యకర్త శ్రీనుకు తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని కూచిపూడి గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీల కార్యకర్త శ్రీను ప్రమాదవ శాత్తు చెట్టు పై నుంచి కిందపడ్డాడు. అతనికి దెబ్బతగలడంతో తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్నాడు. దీంతో గ్రామ తెలుగు యువత ఆధ్వర్యంలో శ్రీనుకు రూ.30 వేల ఆర్థిక సహాయం అందించా రు. ఈ నగదును పార్టీ నాయకులు తుమ్మల భుజంగరావు, యలవర్తి బ్రహ్మానందం, మారుపూడి ఆనంద్, యలమంచిలి జగన్మోహనరావు (బాజీ)ల చేతుల మీదుగా అందించారు.

ఆంజనేయస్వామికి అరటి పూల పూజ



అరటి పూల పూజలో ఆంజనేయస్వామి

వేమూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామంలో ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి వారి దేవస్థానంలో ఏకాదశి దీక్షతో నిర్వహిస్తున్న వార్షిక హనుమజ్జయంతి వార్షిక ఉత్సవాలలో భాగంగా సోమవారం స్వామి వారికి అరటి పుష్పాలతో విశేషంగా పూజ నిర్వహించారు. మన్నే శివవెంకటేశ్వరరావు దంపతులు ఉదయం సుప్రభాత సేవ అనంతరం పంచామృత అభిషేకం జరిపించి పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం స్వామి వారికి అష్టోత్తర సహస్ర నామాలతో అరటి పుష్పాల మాలలను అలంకరించి పుష్పాలతో విశేషంగా పూజ జరిపారు. పల్లకి ఉత్సవం నిర్వహించారు. భజన సంఘాల వారు హనుమాన్ చాలీసా పారాయణ భజన కీర్తనలు ఆలపించారు.

కొనసాగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు

భట్టిప్రోలు (కొల్లూరు), మే 19 (ఆంధ్రజ్యోతి) : హనుమజ్జయంతి ఉత్సవాలు రెండవ రోజు ఘనంగా సాగాయి. మండల పరిధిలోని ఐలవరం ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో జయంతి ఉత్సవాలలో భాగంగా ఏకాహ హనుమాన్‌చాలీసా పారాయణం, భజన సంకీర్తనలు 24 గంటల పాటు నిర్వహించారు. బాపట్ల తపోవనం పీఠాధిపతులు వాసుదేవానంద స్వామిజీ అనుగ్రహ భాషణం చేశారు. హనుమంతుడు లోక రక్షకుడు అని, ఆయనను పూజించడం ద్వారా దుష్టశక్తులు, రాక్షసగణాల నుంచి కీడు తొలగి విజయం చేకూరుతుందన్నారు. జ్ఞాన, భక్తి మార్గాల ద్వారా ముక్తి కలుగుతుందని భక్తులకు తెలియజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు దీవి రఘునాధచక్రవర్తి ఆధ్వర్యంలో స్వామి వారికి నాగవల్లీ దళార్చన నిర్వహించారు. కార్యక్రమంలో దీపాల సత్యనారాయణ, ఎం.రంగారావు, వామనపల్లి వెంకటకోటేశ్వరరావు, జంజనం హేమశంకరరావు, కౌతరపు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

22న హనుమత్ జయంతి ఉత్సవాలు

భట్టిప్రోలు (కొల్లూరు), మే 19 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 22వ తేదీన 42వ హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీ వేంకటేశ్వర భజన సమాజం సభ్యులు సోమవారం తెలిపారు. భట్టిప్రోలులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామికి ఈనెల 22న ఉదయం 9 గంటలకు సహస్ర నామాలతో ఆకు పూజ అనంతరం భజన నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు దేవస్థాన ఆవరణలో భక్తులకు సమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు.

యాచకుడికి బియ్యం అందజేత

కర్లపాలెం, మే 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీఛత్రపతి శివాజి మహారాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం యాచకుడికి 10 కిలోల బియ్యం ఫౌండేషన్ అధ్యక్షుడు శివాజీరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంతెన రామరాజు, పెనుమెత్స నరసింహమూర్తిరాజు, హనుమంతరావునాయుడు, పెనుమెత్స చిన్న చిన్నా, పెనుమెత్స మల్లికార్జునరాజు, తిరువీధుల రవికుమార్, మంతెన నాగవర్మ, శ్రీనివాసరాజు, భాగ్యరాజ్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి.. హనుమత్ జయంతి ఉత్సవాలు



స్వర్ణ వెంకటేశ్వరస్వామి

- పొన్నూరు విచ్చేయనున్న దీక్ష పరులు
- ఉత్సవాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు

పొన్నూరుటౌన్, మే 19(ఆంధ్రజ్యోతి) : పొన్నూరు పట్టణంలో ప్రసిద్ధి చెందిన వీరాంజనేయ స్వామి ఆలయం హనుమత్ జయంతి ఉత్సవాలకు ముస్తాబయింది. ఇక్కడి శ్రీ వీరాంజనేయ స్వామిని ఏక శిలా రూపంలో 1969లో ప్రతిష్టించారు. 24 అడుగుల ఎత్తు, 12 అడుగుల వెడల్పు ఉన్న శ్రీ వీరాంజనేయ శిల్పాన్ని అద్భుత కళా నైపుణ్యంలో రూపొందించడమే కాకుండా గోష్పీవనాన్ని వ్యయ ప్రయాలకు ఓర్చి తరలించి ప్రతిష్టించారు. ఈ భారీ వీరాంజనేయ స్వామిని , వీక్షించి పూజించేందుకు ప్రతి ఏటా జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి హనుమత్ దీక్షా పరులు పెద్ద ఎత్తున తరలి వస్తారు. అంతే కాకుండా ఈ ఆలయంలోనే కొలువు దీరిన మహా వీర గరుత్మంత స్వామి విగ్రహం, 30 అడుగుల ఎత్తుతో, 15 అడుగుల వెడల్పుతో భక్తులను ఆకర్షిసుంది. ఐదెకరాల సువిశాల ప్రాంగణంలో కొలువు దీరిన మరో ఆలయం సహస్ర లింగేశ్వరస్వామి ఆలయంలో మూల విరాట్ లింగరూపంలోనూ మరో వైపు విగ్రహ రూపంలోనూ భక్తులు దర్శించుకోవచ్చు. అంతే కాకుండా 1108 శివలింగాలు నిరంతరం భక్తుల పూజలు అందుకుంటున్నాయి. అలాగే దశావతారాల ఆలయం, సర్వపాప విమోచన కర కాలభైరవ స్వామి ఆలయం, వంటి ఎన్నో విశిష్టతలు కలిగిన ఉపాలయాలతో పాటు 5 అఖండ జ్యోతుల మందిరాల సైతం ఈ ఆలయంలోనే భక్తుల పూజలు అందుకుంటున్నాయి. నేడు శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ జయంతి ఉత్సవాలకు అంకురార్పణ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 21, 22 తేదీలలో తెల్లవారుజామున వీరాంజనేయ స్వామి వారి విగ్రహానికి మంత్ర జలాలు, పంచామృత అభిషేకాలు నిర్వహిస్తారు. హనుమత్ జయంతి రోజున స్వామి వారికి ప్రీతికరమైన నాగవల్లి దళాలు(తమలపాకులు), లక్ష మల్లెల పూజలు, శ్రీ సువర్చలా సమేత వీరాంజనేయ స్వామి దివ్య కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించేలా ఆలయంలో ఏర్పాట్లు జరిగాయి.



ఏకశిల వీరాంజనేయ స్వామి

ఎమినిటీస్ సెక్రటరీలు ఎక్కడ?

- చాలామంది దీర్ఘకాలిక సెలవులోకి
- అనుమతి లేకుండానే కొందరు గైర్హాజరు
- 2ఏళ్ల తర్వాత వచ్చినా జాయినింగ్ ఆర్డర్స్

గుంటూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థలో ఎమినిటీస్ సెక్రెటరీలుగా నియమితులైన ఇంజనీరింగ్ పట్టభద్రులు ఒక్కొక్కరుగా బయటకు వెళ్లిపోతున్నారు. ఇప్పటివరకు వాళ్లకు సక్రమంగా ప్రమోషన్ ఛానల్ డిజైన్ కాకపోవడం, జీతాలు చూడబోతే రూ. 30 వేలకు కొంచెం అటుఇటుగానే నెలకు వస్తుండటంతో ఎమినిటీస్ సెక్రెటరీలుగా కొనసాగలేకపోతున్నారు. ఇక్కడ అధికారులు, కార్పొరేటర్లు/కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తగిన గౌరవం కూడా ఇవ్వకపోతుండటంతో వేరే దారి వెతుక్కుంటున్నారు. కొందరైతే ఇప్పటికే విదేశాలకు వెళ్లిపోయి అక్కడ ఎంఎస్ పూర్తి చేసి ఉద్యోగాలు తెచ్చుకొని ఆయా దేశాల్లో కొనసాగుతున్నారు. మరికొందరు హైదరాబాద్/బెంగళూరు/చెన్నైలోని ఐటీ కంపెనీల్లో మంచి ప్యాకేజీ ఉద్యోగాల్లో చేరారు. ఇంకొందరు ఏపీసీఆర్‌డీఏ, హౌసింగ్, మునిసిపల్ ఇంజనీర్-ఇన్-చీఫ్ కార్యాలయాలకు డిప్యుటేషన్లపై వెళ్లిపోతున్నారు.

ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేట్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు వైసీపీ ప్రభుత్వ హయాంలో పరీక్షలు పెట్టి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎమినిటీస్ సెక్రెటరీలుగా పోస్టింగ్‌లు చేశారు. ప్రభుత్వ ఉద్యోగం కావడంతో చాలామంది పట్టభద్రులు అప్పటికే వివిధ కంపెనీల్లో నెలకు రూ. 60 వేల నుంచి రూ. 80 వేల వరకు ఉన్న జీతాలను కూడా వదులుకొని వచ్చి రూ. 15 వేల జీతంపై విధుల్లో చేరారు. జీతం పేస్కేల్ నిర్ణయించడానికి ఎక్కువ సమయం అప్పటి ప్రభుత్వం తీసుకోవడంతో తమ భవిష్యత్తు ఎక్కడ అంధకారం అవుతుందోనని చాలామంది ప్రత్యామ్నాయం చూసుకొన్నారు. గుంటూరు నగరంలోనే పది నుంచి 20 మంది మధ్యన ఎమినిటీస్ సెక్రెటరీలు ఎలాంటి అనుమతి తీసుకోకుండానే విదేశాలకు వెళ్లిపోయి అక్కడ చదువు పూర్తి చేసి ఉద్యోగాలు చేసుకొంటున్నారు. ఒక ఉద్యోగి అయితే రైల్వేలో మెకానికల్ విభాగంలో మంచి ఉద్యోగం తెచ్చుకొని వెళ్లిపోయాడు. మరో ఎమినిటీస్ సెక్రెటరీ టీసీఎస్‌లోకి వెళ్లారు. సత్తెనపల్లిలో అయితే అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధి ఒక ఉద్యోగిని తీవ్రంగా అవమానించడంతో అతను ఉద్యోగం వదిలేసి ప్రతిష్టాత్మకమైన సంస్థలో ఎంబీఏ పూర్తి చేసి నేడు మంచి పొజిషన్‌కు చేరుకొన్నారు. ఉన్న కొద్దిమందికి నాలుగైదు సచివాలయాలను పర్యవేక్షించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. కొంతమందిని ఏపీసీఆర్‌డీఏ డిప్యుటేషన్‌పై తీసుకొన్నది. హౌసింగ్, ఈఎన్‌సీ కార్యాలయాలు కూడా కొందరిని తీసేసుకోవడంతో జిల్లా వ్యాప్తంగా ఎమినిటీస్ సెక్రెటరీల సంఖ్య తగ్గిపోయింది. ఇలా ఎలాంటి అనుమతి తీసుకోకుండా వెళ్లిన వాళ్లలో కొందరు వెనక్కు రాగా సంబంధిత అధికారులు ఫైళ్లు నడిపి జాయినింగ్ ఆర్డర్స్ ఇచ్చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం ఒక సచివాలయంలో ఎమిని టీస్ సెక్రెటరీ/ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రెటరీలలో ఒకరు మాత్రమే ఉండాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామాల్లో అయితే ఇంజనీరింగ్/ఎనర్జీ అసిస్టెంట్‌లలో ఒకరే ఉండాలని పేర్కొన్నది.

హార్వెస్టర్ కోత.. పశు పోషణకు వాత

- పెరిగిన ఎండుగడ్డి ధరలు
- తగ్గుతున్న సంప్రదాయ కోతలు
- నానాటికి తగ్గుముఖం పడుతున్న పాడిరైతులు

తెనాలి రూరల్,మే19 (ఆంధ్రజ్యోతి): ఎండుగడ్డి ధరలు నానాటికి పెరిగిపోతుండటంతో పశుపోషకులు తలకు మించిన భారంగా మారి ఆందోళన చెందుతున్నారు. కృష్ణా డెల్టాలో దాదాపుగా ఖరీఫ్‌లో 5 లక్షల ఎకరాలకు పైగా వరి సాగయింది. పంటలు కూడా బాగా పండాయి. పంటలు చేతికి వచ్చే సమయానికి వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో ఎక్కువ సంఖ్యలో అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునేలా హార్వెస్టర్లతో కోతలు కోయిస్తున్నారు. వీటి ద్వారా అయితే ఎప్పటి ధాన్యం అప్పుడు వెలుపలకు తరలించుకునే అవకాశం ఉంటుంది. పైగా కూలీల ఖర్చుకూడా తగ్గుతుందన్న ఉద్దేశంతో సంప్రదాయ కోతలు, కుప్పలూ, నూర్పిడిల వైపు మొగ్గు చూపడంలేదు. హార్వెస్టర్‌తో వరిపైర్లను కోతలు కోయించే క్రమంలో ఎండుగడ్డి ముక్కలుగా అవడంతో పశుపోషణకు వినియోగించుకునే పరిస్థితి అతితక్కువగా ఉంటుంది. సంప్రదాయ నూర్పిడి వల్ల ఎండుగడ్డి ముక్కలవ్వకుండా లభించడంతో పాటు వాటిని కట్టలుగా కట్టి పశువులకు మేతగా వినియోగించుకోవచ్చు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా రైతాంగం 75శాతం వరకూ హార్వెస్టర్లతోనే కోతలు కోయించడానికి మక్కువ చూపుతున్నారు. మిగిలిన 25శాతం మంది మాత్రమే సంప్రదాయ కోతలను కోయిస్తూ కుప్పలు వేయించి ధాన్యం తీసుకుంటూ ఎండుగడ్డిని పశుపోషణకు తరలించుకుంటున్నారు. డెల్టా ప్రాంతం కావడంతో రెండో పంట రబీసాగుకు ముందే కోతల అనంతరం హార్వెస్టర్‌తో కోయించి ఎండుగడ్డి ముక్కలను రైతులు 90శాతం పొలాల్లోనే తగలబెట్టడంతో గడ్డి అగ్నికి ఆహుతై బూడిదగా మారుతుంది. మిగిలిన 10శాతం రైతులు మాత్రమే ఆ గడ్డిని కట్టలు కట్టి ట్రాక్టర్ మిషన్ ద్వారా ఉండలుగా చుట్టించుకుని తరలించుకునే పరిస్థితి. ఈ పరిణామాలతో ఎండుగడ్డి కొరత తీవ్రమవుతోంది. ఒక్క ఎండుగడ్డికే పాడిరైతు దాదాపుగా రూ.12000 నుంచి రూ. 15000 వరకూ వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వీటికి తోడు దాణా, పచ్చిగడ్డి, తవుడు, బెల్లం వంటి వాటి ధరలు కూడా పెరగడంతో పశుపోషణ భారంగా మారి పాడిరైతులు పశుపెంపకాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఏ గ్రామీణ ప్రాంతాల్లో ఏ ఇంట చూసినా పాడిగేదెలు ఉండేవి. రాను రాను అవి క్రమేపీ తగ్గుతూ 10 ఇళ్లకు ఒక గేదె వంతున పెంపకం దారులుగా ఉంటున్నారు. ఇదే కొనసాగితే పశుపెంపకం దారులు తగ్గి పాల కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. ప్రభుత్వం పాడి పరిశ్రమను అభివృద్ధికి ప్రణాళికతో ముందుకు సాగితే తప్ప దీనికి పరిష్కారం లభించదని పలువురు విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



పంటపొలాల్లో అక్కడక్కడా ఉన్న పచ్చిమేత మేస్తున్న పశువులు



ట్రాక్టర్‌తో తెనాలి ప్రాంతానికి తీసుకువస్తున్న ఎండుగడ్డి

ప్రారంభమైన కళా పరిషత్ నాటిక పోటీలు

వినుకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ 102వ జయంతిని పురస్కరించుకొని ఎన్‌టీఆర్ కళా పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన నాటిక పోటీలను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సోమవారం ప్రారంభించారు. ముందుగా నటరాజు, ఎన్టీఆర్‌లకు పూజలు నిర్వహించారు. శివశక్తి లీలా ఫౌండేషన్ చైర్మన్ లీలావతి, మాజీ ఎమ్మెల్యే మక్కెన భార్య మక్కెన పద్మావతి, ప్రభుత్వ న్యాయవాది ముప్పాళ్ల కల్పణ పాల్గొని జ్యోతి వెలిగించి నాటికల పోటీలను ప్రారంభించారు. మొదటి రోజు శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారి జనరల్ బోగీలు నాటిక, ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి కిడ్నాప్ నాటికలను శ్రోతలను విశేషంగా ఆకట్టుకున్నాయి. పోటీలను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ, మాజీ ఎమ్మెల్యేలు సతీసమేతంగా తిలకించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ముత్తినేని గిరిబాబు, బొల్లా వెంకట కోటయ్య, జ్ఞానేశ్వరరావు, రామకోటేశ్వరరావు, కౌన్సిలర్ షకీలా బేగం, జనసేన పార్టీ నాగశ్రీను రాయల్, తదితరులు పాల్గొన్నారు.



జనరల్ బోగీలు నాటికలోని సన్నివేశం



నాటిక పోటీలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన



దుర్గిలో జరిగిన శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి , ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి

విద్యాలయాల అభివృద్ధిపై
ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి
- కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దుర్గి, కారంపూడి మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బంగారు భవిష్యత్‌కు పునాదులే విద్యాలయాలు అని విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. దుర్గిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం, ఆదర్శ పాఠశాల, కారంపూడిలోని కేజీబీవీలో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. దుర్గి కస్తూర్బాగాంధీ గిరిజన బాలికల పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం రూ.1,51,50,000 ఆదర్శ పాఠశాలలో బాలికల వసతిగృహ నిర్మాణం కోసం రూ.1,72,86,000 మంజూరైనట్లు తెలిపారు. కారంపూడి కేజీబీవీలో రూ. 1.50 కోట్లతో వసతి గృహం, అదనపు గదులు నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇక్కడ వసతి గృహం లేక విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి.. మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే నిధులు మంజూరు చేశారని వెల్లడించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని మంత్రి పేర్కొన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పల్నాడు జిల్లా అభివృద్ధిలో దూసుకెళ్తోందని, తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా చేసేందుకు వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులను వైన్స్‌ల వద్ద కాపలా ఉంచారని, దోచుకో.. దాచుకో అన్న చందాన వ్యవహరించారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కూడా గడవకముందే రోడ్ల నిర్మాణంతో పాటు పాఠశాలల అభివృద్ధికి మాచర్ల నియోజకవర్గానికి పెద్ద మొత్తంలో నిధులు రావడం అదృష్టమన్నారు. అనంతరం మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేను దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కారంపూడి మండలంలోని మిర్యాల గ్రామం ఎస్సీ కాలనీ వాసులు ఆ గ్రామ నేత దారెడ్డి ప్రభాకరరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. టీడీపీ అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, కారంపూడి అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరి, ఎంపీపీ యేచూరి సునీతా శంకర్, దారునాయక్, యాగంటి మల్లికార్జునరావు, ఇతర నాయకులు, మండలాధికారులు పాల్గొన్నారు.



కారంపూడిలో శంకుస్థాపన చేస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి

అవగాహనతో.. చౌడు భూముల్లో సిరులు



బాపట్లలోని అఖిలభారత సమన్వయ ఉప్పునీటి పరిశోధన కేంద్రం

బాపట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సమీపిస్తోంది. సాగుకు రైతు భూమి సిద్ధం చేయడానికి సమాయత్తమవుతున్నారు. భూమి యాజమాన్య పద్ధతుల్లో రైతులు అనాదిగా ఒకే విధమైన పద్ధతులు పాటిస్తున్నారు. దీంతో సరయిన దిగుబడులు సాధించలేక పోతున్నారు. ముఖ్యంగా తీర ప్రాంతంలో సముద్ర జలాలు భూగర్భంలో చొచ్చుకు వస్తున్నాయి. దీంతో పలు చోట్ల భూములు చౌడుబారుతున్నాయి. రైతులకు ఆ భూముల యాజమాన్య పద్ధతులపై అవగాహన ఉండడం లేదు. ఈ నేపథ్యంలో వాటి యాజమాన్య పద్ధతులను వ్యవసాయ శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు.

ఉప్పునేలలు (తెల్ల,పాలచౌడు) : భూ ఉపరితలంపై తెల్లపొరలాగా ఏర్పడటం తగినంత తేమ ఉన్నప్పటికీ మొక్కలు వడిలిపోవటం జరుగుతుంది. వర్షపాతం తక్కువగా ఉండి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే ప్రాంతాలలోని భూముల్లో నీరు ఆవిరయి వాతావరణంలో కలుస్తుంది. ఈ సమయంలో భూమిలో ఉన్న లవణాలు నీటి ద్వారా భూమి పై పొరలోకి వస్తాయి. నీటిమట్టం భూమి ఉపరితలానికి అతిదగ్గరగా ఉన్న నేలల్లో సహజంగా లవణ శాతం అధికంగా ఉంటుంది. మురుగునీరు పోయే వసతి లేని ప్రాంతాలలోను, కావాల్సిన పరిమాణం కన్న ఎక్కువనీరు ఉపయోగించినప్పుడు, లవణాలతో కూడిన నీరు సాగుకు వాడినప్పుడు పాలచౌడుగా మారుతాయి.



సముద్రతీర ప్రాంత గ్రామాలలోని పాలచౌడు భూములు

లక్షణాలు

నేలపై పొరలలో బుడిద రంగుగల ఉప్పు పొక్కు గట్టి తెల్లగా పేరుకుంటాయి. ఈ లక్షణాలు వేసవి చివరిలో బాగా కనిపిస్తాయి. ఈ భూములు వర్షాలు పడగానే దున్ని విత్తనాలు చల్లితే మొలకెత్తావు. మొలకెత్తిన పైరు పెరుగుదల, సాంద్రత తక్కువగా ఉంటుంది. నీరు ఇంకే శక్తి మాములు కంటే ఎక్కువగా ఉంటుంది. నీరు పొలంలో ఉన్నప్పటికి పైరుకు అందక మొక్కఆకులు ముడుచుకుపోయినట్లు కనపడుతాయి. సమస్య ఎక్కువ అయినప్పుడు మొక్కలు చనిపోతాయి. ఈ భూములలో పొటాషియం ఎక్కువ మోతాదులో ఉంటుంది.

యాజమాన్యపద్ధతులు

ఉప్పునేలలను బాగు చేయటానికి నేలలో ఉన్న నీటిలో కరిగే లవణాలను తొలిగించాలి. ఈనేలలను బాగు చేయటానికి మంచి నీరు అవసరం. నేలపై పేరుకుపోయిన ఉప్పు లేక తెల్లచౌడును పొరలతో తొలిగించాలి. వాలును బట్టి పొలాన్ని చిన్నచిన్న మడులుగా చేసుకోవాలి. ప్రతిమడికి నీరు పెట్టి కాల్వల ద్వారా బయటకు పంపించాలి. ప్రతిమడిలో 15-20 అంగుళాల వరకు నీరు పెట్టి బాగా దమ్ము చేయాలి ఈవిధంగా చేయటం వలన నీటిలో లవణాలు కరుగుతాయి. నాలుగురోజుల తర్వాత ఇంకిపోగా మిగిలిన నీటిని మురుగుకాల్వ ద్వారా బయటకు పంపాలి. ఈవిధంగా లవణాలు తొలిగిపోయే వరకు మళ్ళీ మళ్ళీ చేయాలి. అదేవిధంగా పచ్చిరొట్ట, పశువుల ఎరువు, సూపర్ ఫాస్ఫేట్‌ను ఎక్కువగా వాడాలి. క్లోరైడ్, సల్ఫేట్ కలిగిన ఎరువులను వాడరాదు. అధికమోతాదులో నత్రజని ఎరువును వాడాలి. సేంద్రియ ఎరువు, జీవన ఎరువులు, రసాయనిక ఎరువులు కలిపి వాడితే మంచి ఫలితాలు పొందవచ్చు. ఈభూములలో ఎక్కువ సాంద్రతలో మొక్కలు ఉండేవిధంగా చూడాలి. ఈ భూములకు ఎక్కువగా ఆమ్ల గుణం, అమోనియం సల్ఫేట్, యూరియా ఎరువులను వాడుటం మేలు. వీటిని చివరి దమ్ములో వేయాలి.

నల్లచౌడుభూములు (క్షార) : మురుగునీరు నిల్వ ఉండటం, నేల గట్టిపడటం, తక్కువనీరు ఇంకేగుణం, నీరు, మట్టికోత, మట్టి రేణువులు విడిపోవటం వల్ల నల్లనిరంగు సంతరించుకుంటుంది. మొక్కల పెరుగుదల క్షీణించి ఆకుల అంచుల వెంబడి ఎండి మాడిపోతాయి.

లక్షణాలు


నల్లచౌడుభూములు వర్షా కాలం వచ్చేసరికి భూమిపై నల్లకప్పు ఏర్పడుతుంది. ఉదజని సూచిక 8.3 కన్న ఎక్కువ. లవణశాతం 4.0 కన్న తక్కువగా మార్పిడి చెంది సోడియం 15శాతం కన్న ఎక్కువగా ఉంటుంది. నేలలో కణములు విడివిడిగా ఉండటం వలన నేలలో రంధ్రాలు పూడిపోతాయి. నేలలోనికి గాలిని, నీటిని ప్రవేశించనీయవు. మొక్కల జీవనప్రక్రియ సరిగ్గా జరగదు. ఎక్కువ కాలం తేమ ఉంటుంది. ఎండిన తర్వాత నేల చాలా గట్టి పడుతుంది. ఈభూములలో సోడియం కార్బోనేట్స్, బైకార్బోనేట్స్ ఎక్కువ మోతాదులో ఉంటాయి. ఈ భూములలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది.

యాజమాన్యపద్ధతులు

ఈనేలలను బాగుచేయటం అంటే సోడియం తొలిగించటం, ఉదజని సూచిక తగ్గించటం ఈభూములను బాగుచేయటానికి జిప్సం, పైరైట్స్ అను పదార్ధాలను ఉపయోగించవలెను. వీటిల్లో జిప్సం విరివిగా వాడుతారు. ఇందులో మొక్కకు కావాల్సిన కాల్షియం, గంధకం రెండు పోషకపదార్ధాలు ఉన్నాయి. కాల్షియం లోపల ఉన్న భూముల్లో జిప్సంను, కాల్షియం కార్బోనేట్స్ ఎక్కువగా ఉన్న భూములలో పైరైట్స్ లేదా పశువుల ఎరువు వాడాలి. భూమిని చిన్నచిన్న మడులుగా ఏర్పాటు చేసి 0.1శాతం వాలు ఉండేటట్లు చూడాలి. నీరు పెట్టుటకు, తీయటకు వేర్వేరు కాల్వలు తయారు చేయాలి. మంచినీటి వసతి సమృద్ధిగా ఉండాలి. ఈభూములలో జీలుగను పెంచి పూతకు వచ్చినప్పుడు కలియదున్నాలి. రెండు,మూడు సంవత్సరాలు వరుసగా ఈ ప్రక్రియ చేపడితే నల్లచౌడు పూర్తిగా విరిగి పైర్లు బాగా ఎదిగి దిగుబడులు వస్తాయి. ఈ భూములలో నత్రజని, జింకు పోషక పదార్థాలు చాలా తక్కువగా ఉంటాయి. కావున పొలాలు బాగు చేసిన తర్వాత వీటిని తప్పకుండా వాడాలి. అమోనియా సల్ఫేట్, కాల్షియం, అమోనియానైట్రేట్ ఎరువులు యూరియా కన్నా బాగా ఉపయోగపడతాయి. ఈభూములలో 1,2 సంవత్సరాలు పొటాష్ అవసరం ఉండదు. ఈభూములకు పశువుల ఎరువు, పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులు వాడకం చాలా ఉపయోగంగా ఉంటుంది.

యాజమాన్యపద్ధతులు చేపట్టాలి

అఖిలభారత సమన్వయ ఉప్పునీటి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.మధువాణి



తీరప్రాంత గ్రామాలలో భూగర్భ నీరు ఉప్పుగా ఉంటుంది కాబట్టి ఈ నేలలు ఏర్పడుతాయి. వీటిని పునరుద్ధరించటానికి తగిన సూచనలు, సలహాలు పాటించాలి. విచ్చలవిడిగా ఎరువులు వాడరాదు. వర్షాలు తక్కువగా, ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ఈభూములు కనిపిస్తాయి. మంచినీటితో పొలాలను శుద్ధి చేసుకోవాలి. పచ్చిరొట్ట ఎరువులు, పశువుల ఎరువులు ఎంతోమేలు చేస్తాయి.

అవీ..ఇవీ..

పంటసాగుహక్కుపత్రంతో రాయితీలు



కౌలు రైతులకు సూచనలిస్తున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే పంటసాగు హక్కు పత్రం కలిగి ఉండాలని తహసీల్దార్ సింగారావు అన్నారు. మండలంలోని రేణంగివరం, కశ్యాపురం గ్రామాలలో సోమవారం సీసీఆర్ కార్డులపై కౌలు రైతులకు అవగాహన కల్పించారు. సున్నావడ్డీతో పంటరుణాలు, పంటలబీమాతో పాటు అన్నదాత సుఖీభవ, తదితర పథకాల ప్రయోజనాలు పొందాలంటే కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వం అందించే సాయంతో పాటు పంట ఉత్పత్తుల అమ్మకానికి కౌలు రైతులు గుర్తింపు కార్డు కలిగి ఉండాలని ఏవో సుబ్బారెడ్డి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొరెడ్డి ఓబుల్‌రెడ్డి, వీఆర్వో సుమతి, వీఆర్‌ఏ శివాణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రామనామ పారాయణం



పారాయణం చేస్తున్న భక్తులు

పర్చూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) :పర్చూరులో వేంచేసిన శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో శ్రీరామనామ సప్తాహ పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సోమవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈనెల 22న జరిగే శ్రీహనుమాన్ జయంతిని పురస్కరించుకొని, ఐదు రోజులుగా మహిళా భక్తులు నిత్యం శ్రీరాముని, హనుమంతిని నామకీర్తల భజనా కార్యక్రమాలు చేపడుతున్నారు. 22న జరిగే పూర్ణాహుతితో పాటు 108 సార్లు హనుమచాలీసా పారాయణం జరుగుతుందని నిర్వహకులు తెలిపారు. చివరిరోజు ఆలయంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు.

కానిస్టేబుల్ ఈవ్‌టీజింగ్

● దేహశుద్ధి చేసిన ప్రజలు

ఒంగోలు క్రైం, మే19(ఆంధ్రజ్యోతి): యువతుల పట్ల అసభ్య పదజాలంతో మాట్లాడుతున్న ప్రత్యేక విభాగంలో పని చేస్తున్న కానిస్టేబుల్‌కు పలువురు దే హశుద్ధి చేశారు. పూటుగా మద్యం తాగి స్కూటీ మీద వెళుతున్న యువతుల పట్ల అసభ్యపదజాలంతో మాట్లాడాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి ఒంగో లు నగరం మంగమూరు రోడ్డు జంక్షన్ సమీపంలో జరిగింది. దీంతో స్కూటీ మీద వెళుతున్న యువతులు వెంటనే వారి బంధువులకు తెలియజేయడంతో అక్కడకు వచ్చి సదరు కానిస్టేబుల్‌ను చితకబాదారు. వెంటనే డయిల్ 100 కాల్ చేసి పోలీసులకు అప్పగించి వెళ్లారు..

అకాల వర్షానికి తడిసిన వరి ఓదెలు

తాళ్లూరు, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఉదయం కురిసిన అకాల వర్షానికి పలుగ్రామాల్లో కోసిన వరి ఓదె లు తడిసిపోయాయి. దారంవారిపాలెం, తూర్పుగంగవరం, సోమవరప్పాడు తదితర గ్రామాల్లో వరి కోతలు కోసి పొలాల్లో ఓదెలు వేశా రు. వర్షానికి ఓదెలు తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న పంట కోత పూర్తికాగా 90శాతం మేర అమ్మకా లు పూర్త య్యాయి. కోత కోసి అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన మిగిలిన పది శాతం మొక్కజొన్న గింజలను వర్షానికి తడవకుండా ఉండేం దుకు రైతులు పడరాని పాట్లు పడ్డారు. పలుగ్రామాల్లో సైడు కాలువలు పూడకుపోవడంతో వర్షపు నీరు రోడ్లపై ప్రవహించింది.

గ్రామాల్లో పారిశుధ్యం పడక

● రోడ్లవెంబడే ఎరువుల దిబ్బలు
● పట్టించుకోని పాలక వర్గాలు

బల్లికురవ. మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతి నెల మూడో శనివారాన్ని స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రగా పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశాలను జారీ చేసింది. గ్రామాలలో మాత్రం



బల్లికురవ రోడ్డులో ఉన్న ఎరువుల దిబ్బలు

పారిశుధ్యం పడకేసిందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు పర్యటనలకు వచ్చామా..? వెళ్లామా...? వ్యవహరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిశీలనలు చేపట్టటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలకేంద్రం బల్లికురవ మం డల కేంద్రంలో అద్దంకి రోడ్డు, కొమ్మాలపాడు రోడ్డులో పెద్దఎత్తున పేడదిబ్బలు, వ్యర్థాలు రోడ్డుపైకి చేరాయి. మండల కేంద్రంలోనే ఇంత వరకు చెత్త సంపద కేంద్రం ఏర్పాటు చేయకపోవటంతో పెద్ద ఎత్తున రోడ్లవెంబడి వ్యర్థాలు పడవేస్తున్నారు. అలానే అంబడిపూడి గ్రామానికి వెళ్లే ప్రధాన సీసీ రోడ్డు పేడదిబ్బలతో కుంచించుకుపోతుంది. ఈ రోడ్డులో



అంబడిపూడి రహదారిలో ఇరువైపుల ఉన్న పేడదిబ్బలు

పశువైద్యశాల కూడా ఉంది. అయిన అధికారులు ఎవరు ఈ సమస్య గురించి పట్టించుకో వడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎరువుల దిబ్బలవలన రోడ్లపై నడిచే ప్రజలు ముక్కు ముసుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ప్రజలు అంటున్నారు. ఆలానే కొప్పెరపాడు, వల్లాపల్లి, కూకట్లపల్లి, కొణిదెన, చెన్నుపల్లి గ్రామాలలో పారిశుధ్యం పడకేసింది. రోడ్లపై గుండానే మురుగు పారుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైన ప్రభుత్వ ఆదేశాలను పాటించి పారిశుధ్య కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

భారతీయ సంస్కృతి సంప్రదాయాలు గొప్పవి

శృంగేరిపీఠం ఉత్తరాధికారి విదుశేఖర భారతి

అద్దంకి,మే19 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవి అని శృంగేరిపీఠం ఉత్తరాధికారి విదుశేఖర భారతి అన్నారు. శింగరకొండలో మహా కుంభాభిషేకం అనంతరం భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అంజనేయస్వామిని ప్రార్ధించి ఏ కార్యము ప్రారంభించినా దిగ్వి జయంగా పూర్తవుతుందన్నారు. ప్రతిఒక్కరూ తమ వృత్తితో పాటు భగవంతుని ఆరాధన దిన చర్యలో భాగం చేసుకోవాలన్నారు. ప్రసిద్ధ క్షేత్రంగా ఉన్న శింగరకొండలో ప్రసన్నాంజనేయస్వామి సన్నిధానంలో అనేక మంది భక్తుల సంకల్పంతో, విశేష సహకారంతో నిర్మించిన రాతి మండపం ప్రారంభం, మహాకుంభా భిషేకం చేసుకోవడం భక్తుల అదృష్టమ న్నారు. ఆంజనేయస్వామి మహిమ అపారమైనద న్నారు. శింగరకొండలో ఆంజనేయస్వామి, లక్ష్మీనరశింహ స్వామి దేవాలయాలు ఉండ టం ఎంతో విశేషం అన్నారు. ఆంజనేయ స్వామి ఉపవాసం చేయ డం వల్ల సకల అభీ ష్టాలు నెరవేరతాయన్నారు. అనంతరం లక్ష్మీ నర సింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ శ్రీనివాసరావు, పూజా రులు విదుశేఖర భారతికి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అనుగ్రహభాషణం చేస్తున్న విదుశేఖర భారతి

సంతమాగులూరు : మండలంలోని కొప్పరం గ్రామానికి శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి విదుశేఖర భారతి సోమవారం సాయంత్రం వచ్చారు. ఆయనకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ధూళిపాదపూజ, అనుగ్రహ భాషణ, చేశారు. చంద్రమౌళిదర్పణ పూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. నేడు కొప్పరం గ్రామంలో నిర్వహిస్తున్న కొప్పరం సిద్ధాంతి చింతలపాటి వీర నీలకంఠ సిద్ధాంతి శత జయంతి సభలో పాల్గొన్నారు. సిద్ధాంతి రాసిన గ్రంథాలలో ఏడు గ్రంథాలు ఆవిష్కరించారు.

పాడి రైతుకు 'బీమా' రక్ష

(5వ పేజీ తరువాయి)

వంద వరకు వెసులుబాటు కల్పించింది. ఒక్కసారి బీమా చెల్లిస్తే మూడేళ్ల పాటు అది అమల్లో ఉండేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులన్నీ ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రాగా.. ఈ నెల మొదటి వారం నుంచి బీమా ప్రక్రియను యంత్రాంగం ముమ్మరం చేసింది.

ఎక్కువ శాతం బీమా గొడుకు కిందకు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న పశు సంపదలో దాదాపు 30 శాతం వరకైనా బీమా గొడుకు కిందకు తెచ్చేలా గ్రామాల్లో అవగాహన కల్పించే చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. పశుసంవర్ధక శాఖ లెక్కల ప్రకారం బాపట్ల జిల్లాలో ఆవులు, ఎద్దుల సంఖ్య 21,930గా ఉండగా, గేదెలు 3,81,764 ఉన్నాయి. గొర్రెలు 4,27,523, మేకలు 49,990, పందులు 3,219 కాగా కోళ్లు 7,76,022 ఉన్నాయి. పల్నాడు జిల్లాలో ఆవుల సంఖ్య 68,000, గేదెలు 4,69,048, గొర్రెలు 4,80,000, మేకలు 1,58,000, పందులు 1,800 నమోదై ఉన్నాయి. గుంటూరు జిల్లాలో గేదెల సంఖ్య 2,20,000 వరకు ఉండగా.. మేకలు, గొర్రెలు కలిపి మూడు లక్షల వరకు ఉన్నాయి. వీటన్నింటికీ బీమా కల్పించేలా పాడి రైతులకు అవగాహన కల్పించడానికి పశు సంవర్ధకశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతులను చైతన్య పరుస్తున్నారు

బకాయిలు చెల్లించి, పాడికి ఊతం

వైసీపీ ఏలుబడిలో అరకొరగా అమలు చేసిన పాడి సంబంధిత పథకాల బకాయిలను కూడా ఈ ప్రభుత్వం చెల్లించింది. బాపట్ల జిల్లాలో రూ.2కోట్ల వరకు పెండింగ్ మొత్తాలను చెల్లించగా గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు రూ.5 కోట్ల వరకు చెల్లించింది. బీమాను ఏడాది పొడవునా ఉధృతంగా అమలు చేసేలా పశుసంవర్ధక శాఖకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గడచిన మూడు నెలల వ్యవధిలో దాదాపు 3 శాతం పశు సంపద వృద్ధి.. మూడు జిల్లాల్లో నమోదు కావడం గమనార్హం.

ప్రమాదకరంగా గ్రానైట్ రాళ్ల రవాణా

● కొరడా ఝుళిపించిన పోలీసులు
● ఐదు వాహనాల సీజ్

చీమకుర్తి, మే19(ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా, ప్రమాదకర రీతిలో గ్రానైట్ రాళ్లను రవాణా చేస్తున్న రవాణాదారులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. సోమవారం ఏకంగా ఐదు వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. రవాణాశాఖాధికారులు, విజిలెన్స్, మైన్స్ అధికారులు ప్రమాదకరమైన రవాణాపై సరైన దృష్టి పెట్టకపోవటంతో వాహనదారులు ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నారు. దీనివల్ల రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న వారు భయ భ్రాంతులు గురవ్వటంతో పాటు ఏక్షణానా ఏ రాయి పడి ప్రాణం మీదకు వస్తుందో అని హడలెత్తుతూ ప్రయాణం సాగిస్తున్నారు. ఈ విషయాన్ని పలువురు పోలీసులు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సీఐ సుబ్బారావు తన సిబ్బందితో



రాళ్లు కిందపడేలా టిప్పర్‌లో లోడింగ్ చేసిన నిర్వాహకులు



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

కలిసి నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్న గ్రానైట్ వాహనాలను పరిశీలించారు. రాళ్లు దొర్లిపడేవిధంగా లోడింగ్ చేసుకొని రవాణా సాగిస్తున్న ఐదు వాహనాలను సీజ్ చేసి చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు ఇలాంటి వాహనాలను సీజ్ చేస్తున్నారని తెలుసుకున్న మరికొన్ని వాహనాలు రవాణా నిలిపివేసి తప్పించుకున్నారు. రోడ్డుపై ప్రయాణికులకు, ఇతర వాహనాలకు ఇబ్బందికరంగా, ప్రాణప్రమాదంగా గ్రానైట్ రవాణా చేస్తే చట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బారావు హెచ్చరించారు. నిబంధనల మేరకు గ్రానైట్ రవాణాను నిర్వహించుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

వానలోనూ కొనసాగిన దీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జోరువానలోనూ తమ ఆందోళన కొనసాగించారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న చేపట్టిన దీక్షలు సోమవారానికి 21వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ సీహెచ్‌వోల న్యాయమైన సమస్య ల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం కానీ, ఇటు అ ధికారులు గాని పట్టించుకున్న పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్య క్తం చేశారు. 23శాతం ఇంక్రిమెంట్‌తో పాటు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. కా ర్యక్రమంలో నాయకులు గంటా ప్రసన్న, పి.శైలజ, దీప్తి, కామేష్, రామాం జనేయులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌వోల పోరుబాట



వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌వోలు

ఒంగోలు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వోలు) పోరుబాట పట్టారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని.. గ్రామ, వార్డు సచివాలయాల రేషన్‌లైజేషన్ కారణంగా పెరిగిన పనిభారాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశలవారీ ఆందోళనకు దిగారు. అందులోభాగంగా సోమవారం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో తహసీల్దార్లను కలిసి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబరు 4 ద్వారా గ్రామ, వార్డు సచివాల యాల రేషన్‌లైజేషన్‌తో తమపై పనిభారం పడుతున్నదని వీఆర్వోలు వాపోతున్నారు. రేషన్‌లైజేషన్‌లో మిగిలిపోయిన గ్రామ రెవెన్యూ అధికారులకు నిర్దిష్టమైన విధి విధానాలతో జీవో జారీ చేయాలని, గ్రామ రెవెన్యూ అధికారులను గ్రామ సచివాలయం నుంచి తప్పించి 2019కి పూర్వం ఉన్న రెవెన్యూ క్లస్టర్ విధానంలో మండల తహసీల్దార్ ఆధ్వర్యంలో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర కమిటీ సూచనలకు అనుగుణంగా జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని వీఆర్వోల సంఘ జిల్లా అధ్యక్షుడు వైపీ రంగయ్య తెలిపారు.

టీడీపీకి కొత్తసారథి

ఒంగోలు పార్లమెంట్ అధ్యక్ష పదవికి పరిశీలనలో ముగ్గురు ఎమ్మెల్యేల పేర్లు

ఇప్పుడా.. కడప మహానాడు తర్వాత

ప్రకటిస్తారా అన్నదానిపై ఇంకా రాని స్పష్టత

ఇద్దరు ఇన్‌చార్జిలకు నామినేటెడ్ పోస్టులు

తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ సారథి మారనున్నారు. ఆ పదవిని మరొకరికి అప్పగించాలని అధిష్ఠానం నిర్ణయించింది. ముగ్గురు ఎమ్మెల్యేల పేర్లను ప్రధానంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలోనే ఒకరిని ఖరారు చేసే అవకాశం ఉంది. శుక్రవారం నిర్వహిస్తున్న జిల్లాస్థాయి మహానాడులో ప్రకటించాలా? లేక రాష్ట్ర మహానాడు తర్వాతా? అన్నదానిపై తర్జనభర్జన జరుగుతోంది. దీంతోపాటు పార్టీ దర్శి, ఎర్రగొండపాలెం ఇన్‌చార్జిలుగా ఉన్న గొట్టిపాటి లక్ష్మి, గూడూరి ఎరిక్షన్‌బాబులకు నామినేటెడ్ పదవులు ఇచ్చే అంశాన్ని అధిష్ఠానం సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.



దామచర్ల జనార్దన్



ముక్కు ఉగ్రనరసింహారెడ్డి



కందుల నారాయణరెడ్డి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడిగా ప్రస్తుతం నూకసాని బాలాజీ ఉన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నామినేటెడ్ పదవులు ఇచ్చిన తొలి జాబితాలోనే ఆయనకు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇచ్చి గౌరవించింది. జోడు పదవుల్లో ఉండటానికి ఆయన సిద్ధంగా ఉన్నప్పటికీ అధిష్ఠానం వేరే విధంగా ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. పార్టీ నిర్మాణం, కార్యకర్తలను గుర్తించడం, గౌరవించడం అన్న అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రత్యేక పరిశీలన చేసినట్లు సమాచారం. తదనుగుణంగా నియోజకవర్గాన్ని, జిల్లాను అంటి పెట్టుకొని పనిచేసే వారికే పార్టీ పదవులు అప్పగించే ఆలోచనలతో అధిష్ఠానం ఉంది.

పరిశీలనలో దామచర్ల,ఉగ్ర, కందుల పేర్లు

జిల్లాల వారీ మంత్రులు, కార్పొరేషన్ పదవులు ఏఏ సామాజికవర్గాల వారికి దక్కాయి, ఇంకా ఎవరికి నామినేటెడ్ పదవులు లభించే అవకాశాలు ఉన్నాయి అన్న అంశాలను పరిగణనలోకి తీసుకుంది. అందుకు అనుగుణంగా సామాజిక వర్గాల సమన్వయానికి కూడా ప్రాధాన్యంఇస్తూ పార్టీ పార్లమెంట్ అధ్యక్షుడిని ఎంపిక చేయాలని నిర్ణయించు కున్నట్లు తెలిసింది. ఆ పదవికి సంబంధించి ఒంగోలు, కనిగిరి ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. అవకాశం ఇస్తే తానూ అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నానని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అధిష్ఠానంకు సంకేతం ఇచ్చినట్లుగా తెలిసింది.

రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్‌లుగా ఉన్న వారికి ఇతరత్రా బాధ్యతలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోనే ఉంటూ ఏదైనా అధికారిక పదవిలో ఉన్న వారిని ఎంపిక చేస్తే వివిధ రకాలుగా కలిసొస్తుందని టీడీపీ అధిష్ఠానం భావించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు పార్టీలో సీనియర్‌గా ఉన్న దామచర్ల జనార్దన్‌ను రాష్ట్రస్థాయి పదవిలో కొనసాగిస్తూ కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డికి పార్లమెంట్ అధ్యక్ష పదవిని కట్టబెట్టే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రి లోకేష్ వద్ద డాక్టర్ ఉగ్ర నూటికి నూరు శాతం మార్కులు పొందారు. రాష్ట్రంలో ఎక్కడ పార్టీపరంగా ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు జరుగుతున్నా ఆయనను పిలిచి ప్రత్యేక బాధ్యతలు అప్పగిస్తున్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగే కార్యకర్తల శిక్షణ తరగతుల్లో నాయకత్వ లక్షణాలపై డాక్టర్ ఉగ్ర చేత శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇక జిల్లాలో దామచర్లకు ఉన్న ప్రత్యేక ప్రాధాన్యం తెలియంది కాదు. అధ్యక్ష బాధ్యతలు తీసుకోవాలని ఆయన వర్గీయులు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు పశ్చిమప్రాంతానికి ప్రాధాన్యం ఇచ్చి తనకు అవకాశం కల్పించాలని కందుల నారాయణరెడ్డి కోరడంతో ఆయన పేరును పరిశీలనలోకి తీసుకున్నారు.

ఆ ఇద్దరికీ నామినేటెడ్ పదవులు

గత ఎన్నికల్లో ఓడిపోయి పార్టీ ఇన్‌చార్జిలుగా ఉన్న ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మిలకు నామినేటెడ్ పదవులు ఇచ్చే ఆలోచలలో అధిష్ఠానం ఉంది. ప్రొటోకాల్ సమస్యతో వైసీపీ ఎమ్మెల్యేల నుంచి వారు ఎదుర్కొంటున్న విమర్శలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని అధిష్ఠానం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఈవిషయమై ఇటీవల జిల్లాకు సంబంధం ఉన్న కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ప్రత్యేక చర్చ కూడా నడిచింది. ప్రస్తుతం జిల్లాస్థాయిలో ఖాళీగా ఉన్న ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా)తోపాటు రాష్ట్రస్థాయిలో ఒక కార్పొరేషన్‌ను ఎంపిక చేసి వారికి ఇవ్వాలన్న ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది. అనంతరం సామాజిక వర్గాల వారీగా పరిశీలన చేసి పార్టీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్ష పదవికి ఉగ్ర, దామచర్లలలో ఒకరిని ఎంపిక చేయనున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల అధ్యక్షుల ఎంపికపై అధిష్ఠానం ఇంకా తుది నిర్ణయానికి రాలేదని సమాచారం. దీంతో పార్లమెంట్ స్థాయి మహానాడులో ప్రకటించాలా? కడప మహానాడు తర్వాత ప్రకటించాలా? అన్న విషయమై తుది నిర్ణయానికి అధిష్ఠానం రాలేదని తెలుస్తోంది.

టీడీపీ నియోజకవర్గ మినీ మహానాడులు ప్రారంభం

తొలిరోజు కొండపి, కనిగిరి, దర్శి, మార్కాపురంలో నిర్వహణ

పార్టీ పటిష్టతపై ముఖ్యనేతల దిశానిర్దేశం

నేడు గిద్దలూరులో మినీ పండుగ

పలుచోట్ల సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీల్లో పాల్గొన్న నేతలు



కోలాహలంగా..





కనిగిరి మినీ మహానాడులో జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

ఒంగోలు, మే 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తెలుగుదేశం పార్టీ మినీ మహానాడులు కోలాహలం ప్రారంభమయ్యాయి. మొత్తం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా కొండపి, కనిగిరి, దర్శి, మార్కాపురంలలో సోమవారం వీటిని నిర్వహించారు. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామ, మండల, పట్టణ కమిటీలు, అనుబంధ సంఘాల బాధ్యులతో మినీ మహానాడుల నిర్వహణకు అధిష్ఠానం ఆదేశించగా అలాగే నిర్వహించారు. కొండపి నియోజకవర్గ మినీ మహానాడు కొండపిలో ఏర్పాటు చేశారు. మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు. కనిగిరిలో అక్కడి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మార్కాపురంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, దర్శిలో అక్కడి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిల సారథ్యంలో మినీ మహానాడులు జరిగాయి. గ్రామ, పట్టణాలకు చెందిన ముఖ్యనాయకులంతా ఉత్సాహంగా హాజరయ్యారు. టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడైన రాష్ట్ర టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ కనిగిరి, దర్శి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గడిచిన 11 మాసాల్లో రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం సాధించిన విజయాలను ఈ సందర్భంగా నాయకులు వివరించారు. విభిన్నవర్గాల ప్రజల కోసం అమలు చేస్తున్న పథకాలను కొనియాడారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని కోరారు. అందుకు కేడర్ ఇంకా చురుగ్గా పనిచేయాలని సూచించారు. మరోవైపు ఆయా నియోజకవర్గాల పరిధిలో శాశ్వత అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై పలు తీర్మానాలు చేశారు. జిల్లాలో మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో గిద్దలూరుకు సంబంధించి మినీ మహానాడు మంగళవారం నిర్వహిస్తున్నారు. వైపాలెంలో, ఒంగోలులో 21న, సంతనూతలపాడు నియోజకవర్గ మినీ మహానాడు 22న నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా పలుచోట్ల తెలుగు తమ్ముళ్ల భారీ ర్యాలీలు చేపట్టారు.



కొండపి మినీ మహానాడులో మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన మారిటైం బోర్డు చైర్మన్ సత్య

అవీ..ఇవీ..

తాటిచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

సంతమాగులూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని మిన్నెకల్లు గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన ఆంజనేయులు, మరో ఇద్దరితో కలిసి తాటికాయలు సేకరించడానికి గ్రామ శివార్లలోని తాటిచెట్ల వద్దకు వెళ్లారు. తాటికాయలు కోసే క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టు నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయన్ను వైద్యచికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గుంటూరులో చికిత్స కొనసాగుతుండగా ఆంజనేయులు గాయాలతో ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఆయన రాణి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి


ట్రాక్టర్ తిరగబడి మృతి చెందిన నాగరాజు

సంతమాగులూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని సజ్జాపురం గ్రామంలోని ఓ గ్రానైట్ క్వారీ వద్ద చోటుచేసుకొంది. ఐదుగురు కార్మికులు సోమవారం ట్రాక్టర్లలో క్వారీలో పనికి వెళ్తూ ట్రాక్టర్‌పై కొండ ఎక్కుతుండగా ట్రాక్టర్ తిరగబడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన డ్రైవర్ ఇలుమలై నాగరాజ్(44) ట్రాక్టర్ కింద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనతో పాటు ట్రాక్టర్ లో ఉన్న మిగిలిన నలుగురు వ్యక్తులు చిన్న చిన్న దెబ్బలు తగిలాయి. ఈ ఘటనపై ఆయన కుమారుడు ఇలుమలై అజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతమాగులూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోయిన నగదు పర్సు అప్పగింత

- అభినందించిన వన్‌టౌన్ సీఐ సుబ్బారావు

చీరాల, మే 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన కర్నె నాగ బ్రహ్మ చారి సోమవారం పట్టణంలో నగదు పర్స్, ఏటీఎం కార్డులు పోగొట్టు కున్నాడు. ఈ క్రమంలో కొంతసేపు వెదుకులాడి చేసేదేమీలేక వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే కొద్దిసేపటికే స్థానిక జవహర్‌నగర్‌కు చెందిన పాలపర్తి శ్రీనిసరావు తనకు నగదు పర్స్, ఏటీఎం కార్డులు ముంతావారిసెంటర్‌లో దొరికాయని వన్‌టౌన్ స్టేషన్‌కు వచ్చాడు. అయితే వెంటనే సిఐ సుబ్బారావు శ్రీనివాసరావు చేతుల మీదుగానే పర్సు యజమానికి అప్పగించాడు. ప్రతిఒక్కరూ ఇతరుల పట్ల బాధ్యతగా జీవించినప్పుడే ఆనందంగా జీవిస్తారని తెలిపారు. శ్రీనివాసరావును అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

అద్దంకి, మే19(ఆంధ్రజ్యోతి):కారు ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన అద్దంకిలోని శింగరకొండ రహదారిలో దామావారిపాలెంట వద్ద చోటుచేసుకొంది స్థానికుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని కట్టకింద పాలేనికి చెందిన అఖిల్ శింగరకొండ రోడ్డులో దామావారిపాలెం వద్ద నిలబడి ఉండగా కారు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడ్డ అఖిల్‌ను స్థానికులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

ఏఎన్‌ఎం మృతిపై విచారించాలి


సమావేశమైన ప్రభుత్వ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

చీరాల, మే 19 (ఆంధ్రజ్యోతి) : రేపల్లె అర్బన్ హెల్త్‌సెంటర్ ఏఎన్‌ఎం సింగోటి కోటేశ్వరమ్మ మృతిపై పారదర్శకంగా విచారించాలని, నేరస్థులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి పసుమర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కేవలం పని భారంతోనే ఆమె మృతిచెందినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జూన్ 5న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రకౌన్సిల్ జరుగుతుందని వివరించారు. కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రతినిధులు వినోద్, శ్రీనివాసరావు, రవికుమార్, భాగ్యలక్ష్మీ, వెంకాయమ్మ, నజీరీన్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల చేర్పులు, మార్పులను వేగవంతం చేయాలి

- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు


మాట్లాడుతున్న ఆర్‌డీవో చంద్రశేఖరనాయుడు

చీరాల, మే 19 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఓటు వ ా ర ప్పులు, చేర్పులను వేగవంతం చేయాలని, సమ స్యలున్న చోట పరిష్కారం దిశగా ముందుకు సాగాలని, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొ న్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్లు గోపీకృష్ణ, పార్వతి ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలు, బిఎల్‌వోలతో ఫాం 6,7లపై సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు జరిగిన నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. పలు అంశాలపై చర్చించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులకు మహర్దశ

- బీటీ రోడ్ల ఏర్పాటుకు రూ.13.25 కోట్లు మంజూరు
- తీరనున్న గ్రామీణుల కష్టాలు


గుంతలమయమైన రహదారి (ఫైల్)

పర్చూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐదేళ్ల పాలనలో గుంతలమయంగా మారిన పర్చూరు నియోజకవర్గంలోని పలు రహదారులకు కూటమి ప్రభుత్వంలో మహర్దశ పట్టనుంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి ఫలితంగా నియోజకవర్గంలోని పలు రహదారులకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద ప్రభుత్వం రూ.13.25 కోట్లు మంజూరు చేస్తూ నిధులు విడుదల చేసింది. దీంతో పర్చూరులోని పలు రహదారులు బీటీ రోడ్లతో కళకళలాడనున్నాయి. ఐదేళ్ల అస్తవ్యస్తంగా అధ్వానపు రహదారులతో ఇబ్బంది పడిన ప్రజలకు ఊరట లభించ నుంది. ప్రధానంగా కోనంకి, వలపర్ల కడవకుదురు, ఇంకొల్లు ప్రధాన రహదారి నుండి చింతగుంపల, వింజనంపాడు నుంచి తిమ్మరాజుపాలెం వరకు రహదారులు బీటీ రోడ్లుగా అభివృద్ధి చెందను న్నాయి.

నియోజకవర్గంలో పలు పల్లెలకు రహదారులకు ఆర్‌అండ్‌బీ రోడ్లతో అనుసందానించేందుకు కూటమి ప్రభుత్వం రూ.13.25 కోట్లు మంజూరు చేస్తూ నిధులు విడుదల చేసింది. ప్రధానంగా వింజనంపాడు నుంచి తిమ్మరాజుపాలెం వరకు వయా పోలూరు, శ్యామలవారిపాలెం వరకు నాలుగు రిచ్‌ల వారీగా మొత్తం 10.50 కిలోమీటర్లు రూ.7.50 కోట్లతో నిర్మాణం చేపట్టనున్నారు. అదే విధంగా కడవకుదురు ఇంకొల్లు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి చింతగుంపల్లి రహదారి వరకు రూ.1.60 కోట్లు మంజూరు చేశారు. ఎన్‌హెచ్-16 కోనంకి నుండి వలపర్ల వయా జంగమేశ్వరం వరకు మూడున్నర కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టను న్నారు. అలాగే ఎన్‌హెచ్-16 బొల్లాపల్లి వరకు రూ.65 లక్షలు మంజూరు చేశారు.

హామీ ఇచ్చిన ఏడాదిలోనే నిధులు

ఏమ్మెల్యే ఏలూరి గత ఎన్నికల సమయంలో కోనంకి, వలపర్ల, ద్వారకాపాడు, చింతగుంపల, వింజనంపాడు, పోలూరు, శ్యామలవారిపాలెం, బొల్లాపల్లి, గ్రామాలలో ప్రజలకు అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారుల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం తిరగకముందే నిధులు మంజూరు చేయించి రోడ్డు నిర్మాణాలకు స్వీకారం చుట్టారు. పలుమార్లు ఫైళ్లపై ఆయా శాఖల అధికారులతో చర్చించి వెంటనే నిధులు మంజూరు చేసేలా ఒత్తిడి తెచ్చారు. ఎమ్మెల్యే ఏలూరి కృషి ఫలితంగా రూ.13.25 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

రోడ్డుకో చరిత్ర

గత టీడీపీ హయాంలో పలు రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అనంతరం వ్చిన వైసీపీ ప్రభుత్వం రహదారుల టెండర్లు అన్ని రద్దుచేసి రోడ్ల నిర్మాణానికి అనుమతులు నిలిపివేసింది. దీంతో రహదారుల నిర్మాణం పూర్తిగా నిలిచిపోయింది. నాడు చినగంజాం మండలం చింతగుంపల రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్లతో ప్రతిపాదనలు సిద్ధంచేసి మంజూరు చేయించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టెండర్లు రద్దు చేయడంతో రోడ్ల పనులు నిలిచిపోయాయి. దీంతో ఐదేళ్ల గ్రామస్థులు నరకయాతన అనుభవించారు. అనేక రోడ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయించి నిధులు మంజూరు చేయించినా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిర్లక్షణంగా టెండర్లు రద్దుచేయించి రహదారుల అభివృద్ధిని అడ్డుకుంది.

వేట నిషేధాజ్ఞలు ధిక్కరిస్తే కఠిన చర్యలు

అనుమతులు లేకుండా వేట సాగించడంపై విచారణ


మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎఫ్‌డీవో రవీంద్ర

వాడరేవు(చీరాల), మే 19 (ఆంధ్రజ్యోతి) : నిషేదాజ్ఞలు ధిక్కరించి వేటసాగించే మత్స్యకారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఎఫ్‌డీవో రవీంద్ర హెచ్చరించారు. ప్రభుత్వం ప్రస్తుతం తీరంలో ఏప్రిల్ 15 నుండి జూన్ 14 వరకు వేటనిషేదం విధించిందన్నారు. ఏటా ఈ సమయంలో మత్స్య సంపద వృద్ధి చెందే క్రమంలో భాగంగా అధికారులు ఆంక్షలు విధించారు. అయితే కర్రబోటు ఉండి లైసెన్స్ ఉన్న మత్స్యకారులకు వేట చేసుకునే వెసులుబాటు ఉంది. కానీ కొందరు లైసెన్స్ లేని మోటారు బోటు మత్స్యకారులు వేట సాగిస్తున్నారన్న ఫిర్యాదు అందిన నేపథ్యంలో మత్స్య శాఖ అధికారులు వాడరేవుకు చేరుకున్నారు. మెరైన్, ఈపూరుపాలెం పోలీసుల సహకారంతో తనిఖీలు నిర్వహించి అనధికారంగా వేట సాగిస్తున్నట్లు తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేట నిలిపివేయకుంటే కేసులతో పాటు, లైసెన్స్‌లు రద్దు చేసి ప్రభుత్వం అందించే మత్స్యకార పథకాలను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు.

శింగరకొండకు ప్రత్యేక గుర్తింపు వచ్చేలా కృషి

- మంత్రి గొట్టిపాటి రవికుమార్
- రాతి మండపం ప్రారంభం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు రవికుమార్, స్వామి

అద్దంకి, మే 19 (ఆంధ్రజ్యోతి): శింగరకొండకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చేలా అభివృద్ధి చేయనున్నట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో సుమారు రూ.6.83 కోట్లతో నిర్మించిన రాతిమండపాన్ని సోమ వారం విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం దాతల సహకారంతో అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. భక్తులు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆలయాన్ని అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ముందుగా విమాన శిఖర ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలలో శృంగేరి పీఠం ఉత్తరాధి కారి విధుశేఖర భారతీ స్వామి తో కలిసి మంత్రులు రవికుమార్, బాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు, కందుకూరు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ఇంటూరి నాగేశ్వరరావులు పాల్గొన్నారు. ప్రసన్నాంజనేయస్వామికి మంత్రి రవికుమార్ పట్టువస్త్రాలు సమర్పించారు. జీవధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ, ప్రత్యేక అభిషేకములు, పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. సినీనటులు కొల్లా అశోక్‌కుమార్, దేవాదాయశాఖ తిరుపతి రీజనల్ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్ ఆజాద్, మహాకుంభాభిషేకం ప్రత్యేకాధికారి, కాకాని దేవాలయం డిప్యూటి కమిషనర్, ఈవో లీలాకుమార్, శ్రీశైలం దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సూర్యప్రకాశరావు, నర్సరావుపేట గ్రూపు దేవస్థానాల ఈవో రఘునాదరెడ్డి, అద్దంకి గ్రూపు దేవస్థానాల ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, శింగరకొండ ఆలయ ఈవో, అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మానాయుడు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలతోనే సుందరయ్యకు నివాళి


చీరాలలో సుందరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

అద్దంకిటౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రజా పోరాటాలకు, ప్రగతి సాధకులకు నిత్య దర్శనికుడు నిజమైన స్ఫూర్తి పుచ్చలపల్లి సుందరయ్య సీపీఎం సీనియర్ నాయకులు కె. రఘుచంద్ అన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమం తంగిరాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వివక్షతకు, భూస్వామ్యవ్యవస్థకు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేసిన యోధుడు సుందరయ్య అని పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ కరీమ్, బి.విజయకుమార్, ఆర్. కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, ఆదాము, శరత్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రంగారావు

పంగులూరు: శ్రమజీవుల కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం సీనియర్ నేత నాగబోయిన రంగారావు అన్నారు. మండల కేంద్రమైన పంగులూరులో సోమవారం రాత్రి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చిన్ననాటి నుండి ఆదర్శ భావాలతో శ్రమజీవుల కోసం పోరాడిన పుచ్చలపల్లి కమ్యూనిస్ట్‌గానే కాకుండా పార్లమెంట్ సభ్యునిగా సమాజానికి ఉన్నతమైన ఆదర్శాలను చూపారన్నారు. సొంత ఆస్తిని కూడా పార్టీ కోసం పేద ప్రజల కోసం త్యజించారన్నారు. మరోనేత రాయిని వినోద్‌బాబు మాట్లాడుతూ సుంద రయ్య చూపిన మార్గం దేశానికి ఆదర్శనీ యమన్నారు. నాగా ల్యాండ్ యూనివర్శిటీ విశ్రాంత ప్రొఫెసర్ వీరనారాయణ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీని దక్షిణ భారతదేశంలో నిర్మించిన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లారెడ్డి, తలపనేని రామారావులు పాల్గొన్నారు.

చీరాల : పుచ్చలపల్లి సుందర్య నేటి నాయకులకు స్ఫూర్తికావాలని సీపీఎం నాయకులు ఎన్ బాబురావు, నారపరెడ్డి, రంగారావు, సుందర్, బ్రహ్మంలు పేర్కొన్నారు. ఆయన వర్ధంతిని సోమవారం చీరాలలోని ఓ కల్యాణ మండపం వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు ఐదు వినతులు

అద్దంకి, మే19(ఆంధ్రజ్యోతి): అద్దంకి డిపో పరిధిలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ఐదు వినతులు వచ్చినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. అద్దంకి నుంచి వినుకొండకు ఉదయం 6.30 గంటలకు ఏర్పాటు చేయాలని ప్రసన్నాంజనేయులు కోరగా ఆ విషయం వినుకొండ డిపో పరిధిలోనిదన్నారు. అద్దంకి-ఇంకొల్లు-విజయవాడ సర్వీసు ను పునరుద్ధరించాలని బదరీనారాయణ కోరగా గతంలో సరిగ్గా ఆదాయం రానందున నిలిపివేసినట్లు తెలిపారు. కొటికలపూడికి బస్ ఏర్పాటు చేయాలని రాకేష్ కోరగా 2 కి.మీ దూరంలో బస్ రూట్ ఉన్నందున సాధ్యం కాదని తెలిపారు. బొడ్డువాని పాలెం హైవే వద్ద బస్సులు ఆపాలని వీరాంజనేయులు కోరగా, ఇప్పటికే పల్లెవెలుగు బస్సులు నిలుపుతున్నట్లు తెలిపారు. ఒక వేళ బస్సులు నిలపకపోతే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అద్దంకి నుండి బల్లికురవ మీదుగా గుంటూరు కు బస్ ఏర్పాటు చేయాలని శ్రీనివాసరావు కోరగా నర్సరావుపేట, చిలకలూరిపేటల వరకు బస్సులు నడుపుతున్నట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు.

22న అద్దంకిలో నియోజకవర్గ మహానాడు

- హాజరుకానున్న మంత్రి రవికుమార్

అద్దంకి, మే19(ఆంధ్రజ్యోతి) : అద్దంకి నియోజకవర్గ స్థాయి మహానాడు ఈ నెల 22న ఉదయం 10 గంటలకు అద్దంకి పట్టణంలోని నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా విద్యుత్‌శాఖ మం త్రి గొట్టిపాటి రవికుమార్ హాజరుకానున్నారు.

పుష్పలతకు బంగారు పతకం


బంగారు పతకం అందుకుంటున్న పుష్పలత

చీరాల, మే 19 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత అవగాహన అంశంలో చీరాలకు చెందిన నన్నపనేని పుష్పలతకు బంగారు పతకం లభించింది. మైసూరు గణపతి సచ్చిదానంద ఆశ్రమం నుంచి ఈ నెల 2వ తేదీన ఆన్‌లైన్ ద్వారా పీఠంకు చెందిన ఐదుగురు గురువులు 90 నిమిషాలు పాటు నిర్వహించిన భగవద్గీత అవగాహన పోటీలో నన్నపనేని పాల్గొని కళ్లు మూసుకుని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా వివరించారు. ఈక్రమంలో ఆశ్రమం పిలుపు మేరకు శనివారం రాత్రి మైసూర్‌లో జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో పాల్గొని గణపతి సచ్చిదానంద చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు.

అసంబద్ధంగా ఉపాధ్యాయుల బదిలీలు


అభివాదం చేస్తున్న ఉపాధ్యాయులు

చీరాల, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులలో అసంబంధమైన విధానాలు ఉన్నాయని, వాటిని వెంటనే తొలగించి నూతన విధానంతో ఉద్యోగోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయుల సంఘం ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం యూటీఎఫ్, ఏపీటీఎఫ్ ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం పాత జిల్లాకేంద్రాల్లో జిల్లా విద్యాశాఖ కార్యాలయాలు ముట్టడించాలని తీర్మానించారు. సమస్యల పరిష్కారం కోరుతూ చేపడుతున్న ముట్టడి కార్యక్రమానికి పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు భిక్షాలు, నాగమల్లేశ్వరరావు, నారాయణ, శ్రీనివాసులు, ఏసురత్నం, కుర్రా రామారావు, సురేష్ పాల్గొన్నారు.

ఏపీఈఏపీసెట్‌కు 24 మంది గైర్హాజరు

చీరాల, మే 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్‌ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఏపీఈఏపీ సెట్ - 2025 పరీక్షలు జరిగినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. రెండు షిఫ్టులో జరిగిన పరీక్షలకు 24 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ప్రిన్సిపల్ డా.జగదీష్ పర్యవేక్షించారు.

రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు

కాలువలు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు


మేదరమెట్లలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

మేదరమెట్ల, మే 19(ఆంధ్రజ్యోతి): మేదరమెట్లలో 80 శాతానికిపైగా సిమెంట్‌రోడ్లు నిర్మించారు. అయితే అంతేస్థాయిలో కాలువలు మాత్రం నిర్మించలేదు. మట్టి కాలువలల్లో ఎదైన అడ్డు పడినప్పుడు మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. చాలా రోడ్లలో సిమెంట్ రోడ్లపైనే నీరు నిలుస్తోంది. రోడ్లు నాణ్యతతో నిర్మించకపోవడంతో గుంటలు పడిపోయి ఎత్తు పల్లాలుగా ఉండడంతో చిన్నపాటి వర్షానికి కూడా రోడ్లుపై నీరు నిలుస్తోంది. మేజర్ పంచాయతీ అయిన మేదరమెట్ల కూడలి నుంచి గ్రామంలోకి వెళ్లే రెండు ప్రధాన రహదారులలో ఒకటైన మిద్దెలడొంక సైడు కాలువలు నిర్మించలేదు. గత 30 ఏళ్లగా స్థానికులు పలుమార్లు సైడ్‌డ్రైన్లు నిర్మించాలని కోరిన పనులు మాత్రం జరగలేదు. మిద్దెల డొంకలో నిర్మించిన సిమెంట్ రోడ్డు కూడా అత్యంత నాసిరకంగా ఉంది. క్వాలిటీ కంట్రోల్ అధికారులు నాణ్యత సర్టిఫికేట్ ఇవ్వకపోవడంతో ఇప్పటికి రూ.9 లక్షలు పంచాయతీలోనే ఉన్నాయి. అడుగడుగున గుంటలతో అసలు ఇది సిమెంట్ రోడ్డేనా అనేవిధంగా రోడ్డు వేశారు. ఈ రోడ్డుకు రెండు వైపుల కాలువలు నిర్మించక పోవడంతో మురుగునీరు అంత రోడ్డుపైనే ప్రవహిస్తోంది. వివిధ పనులకు వెళ్లే మహిళలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, స్థానికంగా నివసించేవారు కూడా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం చిన్న పిల్లలు ఇంటి ముందు అడుకోవడానికి కూడా లేకుండా పోయిందని వాపోతున్నారు. దీనికి తోడు రోడ్డు ప క్కన పెట్టిన చెత్త కుండిలల్లో మూడు రోజులకు ఒ క సారి శుభ్రం చేయడంతో కుండీలలోని చెత్తను కు క్కలు రోడ్డుపైకి ఈడుస్తున్నాయి. మురుగునీరు రోడ్లు పై ప్రహిస్తున్నాయని గ్రామస్థులు పదే పదే పిర్యాదు చేసినప్పుడు పంచాయతీ అధికారులు తూతు మంత్రంగా కాలువలను సరిచేస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు లభిస్తుందా అని మిద్దెలడొంక వాసులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైన పంచాయతీ అధికారులు స్పందించి సైడ్ డ్రైన్‌ల నిర్మాణంతోపాటు సిమెంట్ రోడ్డు కూడా తిరిగి నిర్మించాలని కోరుతున్నారు.

రహదారికి నిధుల మంజూరుపై హర్షం


సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న నేతలు

మార్టూరు, మే19 (ఆంధ్రజ్యోతి): మండల పరిదిలో కోనంకి నుంచి వలపర్ల మీదగా కొండమూరు వరకు తారురోడ్డు నిర్మాణానికి రూ. 3.50 కోట్ల రూపాయల నిధులు మంజూరుకు కృషి చేసినందులకు సోమవారం రాత్రి వలపర్ల గ్రామంలో టీడీపీ కూటమి నాయకులు ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడలిలోని ఎన్‌టీఆర్ విగ్రహం నుంచి సినిమాహాలు కూడలి వరకు కూటమి నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన కృషితో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని నాయకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అంతేగాకుండా ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుల చిత్రపటాలతో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో కంభంపాటి హనుమంతరావు,షేక్ బషీర్, వంకాయలపాటి వెంకట సుబ్బారావు, శ్రీనివాసరావు, వెలగా రామాంజనేయులు,గుంటి వెంకటేశ్వర్లు,సర్పంచ్ తాళ్లూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.